నేరస్థుడిని
పట్టుకోవాలని
వెళ్ళిన అతనికి
తెలిసిన నిజాలేమిటి?

చిలకలపూడి
సత్యనారాయణ
కథ

# వారెంట్

నాకు ఈ మధ్యే డిఎస్పిగా ప్రమోషన్ వచ్చింది. కమీషనర్ ఆఫీసులో స్పెషల్ బ్రాంచిలో పోస్టింగ్ ఇచ్చేరు.

ఆ రోజు ఆఫీసుకు వెళ్ళి, ఇంపార్టెంట్ పేపర్స్ చూస్తున్న నాతో ''సార్. కమీషనర్ గారు మిమ్మల్ని పిలుస్తున్నారు'' కమీషనర్ బంట్రోతు వచ్చి చెప్పటంతో చూస్తున్న పేపర్స్ పక్కన పెట్టి కమీషనర్ రూముకి వెళ్ళేను. తలుపులు దగ్గర వేసుండటంతో ''మే అయ్ కమిన్ సార్'' తలుపుల మీద వేళ్ళతో తట్టి అడిగేను.

''కమిన్'' అన్న కమీషనర్ పిలుపుతో, తలుపులు తీసుకుని, ఉద్యోగ బాధ్యతలలో ఒకటైన సెల్యూట్ చేసి ''ఎస్ సార్'' అన్నాను.

''కూర్చోండి మిస్టర్ ముకుందరావ్'' కుర్చీ చూపిస్తూ చెప్పాడు కమీషనర్.

ఆయన చూపించిన కుర్చీలో కూర్చుంటూ ''రమ్మన్నారుట'' ఎందుకు రమ్మన్నారో కనుక్కుందామని అడిగేను.

''అవును మిస్టర్ ముకుందరావ్... మీకొక ముఖ్యమైన పని వచ్చింది. అది చెప్పటానికే రమ్మన్నాను'' అంటున్న కమీషనర్‌తో ''చెప్పండి సార్...'' అన్నాను.

''రామాపురం చైర్మన్ రంగారావు మీద హత్యాప్రయత్నం జరిగింది తెలుసుకదా మీకు'' అడిగేడు కమీషనర్.

''పేపర్లో వచ్చింది సార్ చదివేను'' వారంరోజుల క్రితం రామాపురం చైర్మన్ మీద అదే గ్రామానికి చెందిన పాండురంగం అనే అతను తన స్నేహితులతో చైర్మన్ ఇంటి మీద దాడిచేసి చైర్మన్ రంగారావుని



హత్య చేయబోయేడని పేపర్లో చదివింది గుర్తుకొచ్చి చెప్పాను.

"హత్యాప్రయత్నం చేయబోయిన వారిని చైర్మన్ రంగారావు మనుషులు ఎదుర్కొన్నారు. ముఖ్యమైన వాడ్ని తప్ప, మిగతా వారిని రంగారావు మనుషులు పట్టుకుని పోలీసులకు అప్పగించేరు. దొరికిపోయిన వారికి శిక్ష కూడా పడింది. కానీ అసలు

హత్యా ప్రయత్నానికి పూనుకున్న పాండురంగం అనే అతను మాత్రం తప్పించుకుని పారిపోయేడు. మన డిపార్ట్‌మెంట్‌కి దొరక కుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. రామాపురం పోలీసులు మరియు ఆ చుట్టుపక్కలున్న గ్రామ పోలీసులు పాండురంగం కోసం ఉధృతంగా గాలిస్తున్నారు... కానీ ఇంతదాకా పాండురంగం దొరకలేదు. పాండురంగం మన డిపార్ట్‌మెంట్‌కి దొరకకుండా తిరగగలుగుతున్నాడంటే దానికి ఒక కారణం వుంది. రామాపురం ప్రజలకి, ఆ చుట్టుపక్కలున్న గ్రామ ప్రజలకి పాండురంగం చాలా కావలసినవాడు. పాండురంగం ఇంతకు ముందే రెండు మూడు దోపిడీ కేసులలో, పోలీసు వాంటెడ్ లిస్టులో ఉన్నాడు. బహుశా దోపిడీ చేసిన డబ్బును గ్రామ ప్రజలకై ఉపయోగించుంటాడు. అందుకనే ఆ చుట్టుపక్కల గ్రామ ప్రజలకి కావలసిన వాడై ఉంటాడు. ఆ గ్రామ ప్రజలకు పాండురంగం ఎక్కడ దాగి ఉన్నది తెలుసుండొచ్చునని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

"కోర్టు పాండురంగం మీద అరెస్టు వారెంటు ఇచ్చింది. మీరెవరో రామాపురం గ్రామంలోగాని, ఆ చుట్టుపక్కల గ్రామ ప్రజలకు తెలియదు. కాబట్టి, పాండురంగాన్ని పట్టుకునే బాధ్యత మీకు అప్పగిస్తున్నాను. పాండురంగంకి సంబంధించిన విషయాలన్నీ ఈ ఫైల్లో వున్నాయి" అని చెప్పి పాండురంగం ఫైలు నాకందించేడు పోలీసు కమీషనర్.

పాండురంగం ఫైలు తీసుకుంటూ "నా మీద నమ్మకముంచి పాండురంగంని అరెస్టు చేసే డ్యూటీ నాకప్పగించినందుకు నేను చాలా గర్వపడుతున్నాను... అయ్ విల్ ప్రూవ్ మై ఎబిలిటీ సార్" అంటున్న నాతో "ఇంకో ముఖ్య విషయం... చైర్మన్ రంగారావుకి రాజకీయాలలో వున్న పలుకుబడి చాలా పెద్దది. ఇటు రూలింగ్ పార్టీలోను, అటు అపోజిషన్ పార్టీలోను చైర్మన్ రంగారావుకి మంచి పేరుంది. మీరొచ్చే ముందే హోం డిపార్ట్‌మెంట్ నుండి ఫోనొచ్చింది. స్పెషల్ పార్టీని వేసి పాండురంగంను వెంటనే పట్టుకోమని హోమ్ మినిస్టర్ పి.ఏ. ఫోన్ చేసేడు. అందుకని..." కమీషనర్ ఏం చెప్పబోతున్నాడో అర్థమైన నేను "అయ్ అండర్‌స్టాండ్ ది ఇంపార్టెంట్ ఆఫ్ దిస్ కేస్... మీరు నిశ్చింతగా ఉండండి సార్... పాండురంగంని పదిరోజుల్లో అరెస్టు చేసి మన డిపార్ట్‌మెంట్ పేరు నిలబెడతా" కమీషనర్‌కి ధైర్యం చెప్పేను.

"వెరీగుడ్... బైదబై... మీకు ఈ కేసు హేండోవర్ చేసేనని నాకు, మీకు... హోమ్ డిపార్ట్‌మెంట్‌కి తప్ప ఇంకెవరికీ తెలియదు" చెప్పాడు కమీషనర్.

"అయ్ విల్ మెయిన్‌టెయిన్ ద సీక్రెట్" అని చెప్పి కమీషనర్‌కి సెల్యూట్ చేసి బయటకొచ్చి నా రూముకెళ్ళేను.

* * *

రూముకెళ్ళిన నాకు పాండురంగం ఫైలు ఆఫీసులో వదవాలనిపించలేదు. వెంటనే ఫైలుని నా బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుని, పదిహేను రోజులకి సెలవు చీటీ రాసి, కమీషనర్‌కి అందజేసి నేను ఇంటికెళ్ళేను.

ఇంటికెళ్ళిన నాకు అనుకోకుండా మా దగ్గర బంధువులు రావటంతో పాండురంగం ఫైలుని వెంటనే చదవలేకపోయేను.

రాత్రి భోజనాలైన తరువాత, మా బంధువులని సాగనంపి నా భార్యతో నన్ను డిస్టర్బ్ చేయొద్దని చెప్పి, నా రూముకెళ్ళి పాండురంగం ఫైల్‌ని తెరిచాను.

ఫైల్లో మొదటిదిగా నాకు పాండురంగం మీద జారీచేసిన 'వారెంట్' కనబడింది. దాన్ని తీసి నా బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకున్నాను. తర్వాత పాండురంగం ఫోటోతో, పాండురంగం గురించిన డీటైల్స్ వున్న పేపర్ కనబడింది. పాండురంగం ఫోటోని ఒకసారి చూసేను. ఫోటోలో వున్న పాండురంగం ముఖం చూస్తే నాకు క్రిమినల్‌లాగా కనబడ లేదు. 'క్రిమినల్స్ అందరూ ఇలాగే కనబడతారు' అనుకుని పాండురంగం గురించిన డీటైల్స్ చదివేను. పేరు... పాండురంగం.

తండ్రి పేరు — శివరామకృష్ణ, వయస్సు — ఇరవై నాలుగు సంవత్సరాలు.

'చిన్న వయస్సే' అనుకుని మిగతా విషయాలు చదివేను.

వూరు — రామాపురం, చదువు — ఎంఎస్‌సి.

'చాలా పెద్ద చదువే... ఇంత చదువు చదువుకుని తల్లిదండ్రులను సుఖపెట్టాల్సింది పోయి... ఇలా పోలీసు రికార్డ్స్‌లో... ప్చ్... ఈ కాలం కుర్రకారు అనవసరమైన అపోహలతో చెడిపోతున్నారు' అనుకుని మిగతా విషయాలు చదివేను.

తండ్రి ఈ మధ్యే బస్సు యాక్సిడెంట్‌లో చనిపోయినట్లు, తల్లి, పెళ్ళికెదిగిన చెల్లెలు వున్నారని తెలిసింది. రెండో పేజీ తిప్పేను. అది పాండురంగం మీద ఫస్టు చార్జ్... మూడేళ్ళ క్రితం "అంటే ఇప్పుడు పాండురంగంకు ఇరవై ఏడేళ్ళు" అనుకుని మళ్ళీ చదవటం మొదలెట్టేను. "మూడేళ్ళ క్రితం రామాపురంలోని చౌకడిపో మీద, ప్రజలు పడి చౌకడిపోలోని నిత్యావసర



వస్తువులని దోచుకున్న వారిలో ముఖ్య నిందితుడు పాండురంగం.

మూడవ పేజీలో... రామాపురానికి వలభై కిలోమీటర్ల దూరంలో వున్న దశరథ పురంలో జరిగిన బస్సు దోపిడీలో ముఖ్య నిందితుడు పాండురంగం.

నాల్గవ పేజీలో... ఎంఎల్ఏ ముస్తాన్ మీద రామాపురంలో జరిపిన దాడిలో ముఖ్య నిందితుడు పాండురంగం.

ఐదవ పేజీలో... రామాపురం దగ్గర ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న సీతాపురం లో పదిహేడేళ్ళ భవాని మీద జరిగిన మానభంగం కేసులో ముఖ్య నిందితుడు పాండురంగం.

ఆఖరి పేజీలో... రామాపురం చైర్మన్ రంగారావు మీద జరిగిన హత్యాప్రయత్నం లో ముఖ్య నిందితుడు పాండురంగం. కేసు వివరాలు: ఎఫ్ఐఆర్ రిపోర్టు... రామాపురం లోని 'న్యూ' థియేటర్ సెంటర్లోని గవర్నమెంటు ఖాళీ స్థలంలో, పాండురంగం స్నేహితులు శివశంకర్, వేలూ, దయానిధి కలిసి అక్రమంగా ఒక కిళ్ళీ కొట్టు పెట్టేరు. ఆ కిళ్ళీ కొట్టు స్థలానికి పట్టా ఇమ్మని చైర్మన్ రంగారావుని అడిగేరు. అది గవర్న మెంటు స్థలం అని, అక్కడ కొత్త బస్‌స్టేష న్ రాబోతున్నదని కనుక ఆ కిళ్ళీ కొట్టు తీసేయమని సలహా ఇచ్చేడు చైర్మన్ రంగారా వు. వారంరోజులైనా కిళ్ళీ కొట్టు తీయకపోవ టంతో చైర్మన్ రంగారావు పోలీసుల సహా యంతో కిళ్ళీ కొట్టును అక్కడి నుండి తీసేయబోతుంటే అడ్డుపడిన పాండురంగం స్నేహితులని పోలీసులు కస్టడీలోకి తీసుకు న్నారు. మరుసటిరోజు జామీన్‌లో బయటి కొచ్చిన పాండురంగం స్నేహితులు, పాండు రంగంతో చైర్మన్ రంగారావు ఇంటికి వచ్చి, ఇంటి మీద దాడిచేసి, ఇంట్లోని వస్తువులని ధ్వంసం చేస్తూ, అడ్డుపడిన చైర్మన్ రంగారా వు మనుషులని గాయపరిచి, చైర్మన్ రంగా రావుని హత్యచేసే ఉద్దేశంతో ఆయన్ని తీవ్రంగా గాయపరిచి, పారిపోతున్న పాండు రంగం స్నేహితులని చైర్మన్ రంగారావు మనుషులు వెంటబడి పట్టుకున్నారు. కానీ పాండురంగం మాత్రం తప్పించుకున్నాడు" చదువుతున్న ఫైలు ముగియటంతో "పాం డురంగం పెద్ద కేడీలా వున్నా"డనుకుని... పాండురంగంని పట్టుకోవటం తేలిక కాదని ఆలోచించి ఒక ప్లాన్ వేసుకున్నాను.

వెంటనే బ్రీఫ్‌కేస్ సర్దుకుని, పాండురం గం ఫైల్లోంచి ముఖ్యమైన పేపర్లు తీసుకుని బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుని నిద్దరపోవటానికి మంచం ఎక్కేను.

* * *

వేసుకున్న ప్లాన్ ప్రకారం మరుసటిరో జు ప్రొద్దున్నే రామాపురం బయలుదేరేను. రామాపురం చేరుకునేటప్పటికి మధ్యాహ్నం రెండైంది... లాడ్జిలో రూము తీసుకుని, బట్టలు మార్చుకుని, దాహం తీరటానికి రూములో వున్న కుండలోంచి ఒక గ్లాసుడు మంచినీళ్ళు తాగి, లాడ్జి బయటకొచ్చి, ఎదురుగుండా కనబడ్డ ఆటోవాడిని పిలిచి 'న్యూ' థియేటర్ సెంటర్‌కి పొమ్మన్నాను.

ఆటో మ్యా థియేటర్ సెంటర్‌లో ఆగిన తరువాత, ఆటోవాడికి డబ్బులిస్తూ పాండురంగం ఇల్లున్న వీధి పేరు చెప్పి ఎక్కడుందని అడిగితే నేను పోలీసు వాడినని ఆటోవాడికి అనుమానం వస్తుందేమోనని "నాకు అడ్రస్ బాగా తెలియదు. నేను వెళ్ళాల్సిన వీధి దుర్గగుడి వున్న వీధి పక్కది... దుర్గగుడి వున్న వీధికి ఎటువెళ్ళాలి" పాండురంగం ఇంటి వీధిలోంచి వెళితే దుర్గగుడి వస్తుందని పోలీసు రికార్డ్సులో వుండటంతో ఆటోవాడిని అలా అడిగేను.

నా వంక ఒకసారి ఎగాదిగా చూసి "నేరుగా వెళితే రెండో సందు దుర్గగుడికి వెళ్ళే సందు... మీకు కావలసింది దానికి పక్క సందు కదా... ఇటు వెళ్ళండి" ఆటో డబ్బులు తీసుకుంటూ చెప్పి మళ్ళీ నా వంక ఎగాదిగా చూసేడు ఆటోవాడు.

ఆటోవాడు ఎందుకలా చూస్తున్నాడో అర్థంకాక "థాంక్స్" అని వాడికి చెప్పి, ఆటోవాడు చెప్పిన వైపు వెళ్ళేను

రెండో సందు దగ్గర ఆగేను... అదే దుర్గ గుడికెళ్ళే సందు... అంటే ఆ వీధిలోనే పాండురంగం ఇల్లుంది... అది కన్‌ఫర్మ్ చేసుకోటానికి ఎదురుగుండా వస్తున్న ముసలాయన్ని "దుర్గ గుడికి దారి ఏది?" అని అడిగేను... "ఈ వీధిలోంచి నేరుగా వెళ్ళు బాబూ" వినయంగా చెప్పాడు ముసలాయన "థాంక్స్" అని చెప్పి ఆ వీధి గుండా నడిచేను. నెంబర్ ఏడు అని రాసున్న ఇంటి ముందు ఆగేను. అదే పాండురంగం ఇల్లు. గేటులోనుంచి కనబడుతున్న రూములో ఎవరున్నారోనని తలవంచి చూసేను... ఒక మధ్యవయస్కురాలు బియ్యం చెరగటం కనబడింది. "ఆవిడే పాండురంగం తల్లి కాబోలు" అనుకుని ఎక్కువసేపు అక్కడ నిలబడితే అనుమానమొస్తుందని బయలుదేరబోతున్న నన్ను ఎనిమిదో నెంబర్ ఇంట్లోంచి బయటకొచ్చిన ఒకావిడ చూసింది. వెంటనే "ఇక్కడ లక్ష్మణరావ్ అని" అడగబోయేంతలో "అలాంటి వారు ఎవరూ లేరు" మూతి మూడు వంకరలు తిప్పుకుంటూ చెప్పి వెళ్ళిపోయింది. నేను వెంటనే వడివడిగా అడుగులేసుకుంటూ పక్కవీధిలోకి తిరిగి మెల్లిగా నడుస్తూ తర్వాత ప్లాన్ గురించి ఆలోచిస్తుంటే నాకు వెనక నుంచి "సార్" అన్న కేక వినబడటంతో వెనక్కి తిరిగి చూసేను. పన్నెండేళ్ళున్న కుర్రాడు నా దగ్గరకొచ్చి "రండి సార్... ఇదే ఇల్లు"

## తూకం



"నువ్వేదో భారీ నవల రాసి పత్రిక్కి పంపానన్నావ్. ప్రచురించారా?" అడిగాడు సురేష్ రమేష్‌ని.

"ప్రచురించకుండా పది రూపాలను ఎం.ఓ పంపారు" చెప్పాడు రమేష్

"దేనికి?" అడిగాడు సురేష్.

"నా నవలను తూకానికి వేస్తే అంతే వచ్చిందట" మొహం తిప్పుకుంటూ అన్నాడు

—ఎస్.ఎస్.మూర్తి

అన్నాడు. ఎవరీ కుర్రాడు అనుకుంటూ ''ఎవరిల్లు'' అని అడిగేను వాడిని. ''అదేసార్... విశాలం ఇల్లు... మంచి మంచి పిట్టలున్నారు... రండి సార్'' అన్నాడు కుర్రాడు. వాడేం చెప్తున్నాడో అర్థమైంది నాకు. ''పోరా'' అని వాడిని గట్టిగా కసురుకుని ఎక్కువసేపు అక్కడ నిలబడితే విశాలం వస్తుందని భయపడి గబగబ నడుస్తున్న నాకు ''వీడు మొగాడు కాదనుకుంటా'' అనే కుర్రాడి మాటలు వినబడ్డాయి. వాడి మాటలు పట్టించుకోకుండా ఆ వీధి మలుపు తిరిగి 'న్యూ' థియేటర్ సెంటర్‌కి వచ్చేను.

ఆటోవాడు ఎందుకు నన్ను ఎగాదిగా చూశాడో అప్పుడర్థమైంది నాకు. పక్కనున్న కిళ్లీ కొట్లో సిగరెట్ పాకెట్ కొనుక్కుని, సిగరెట్ వెలిగించుకుని పాండురంగంని వెదకే ప్రోగ్రామ్‌లో ఎక్కడి నుంచి మొదలెట్టాలి అని ఆలోచిస్తూ నిలబడ్డ నాకు ఎదురుగుండా టీ కొట్టు కనబడటంతో మొదట టీ తాగుదామని టీ కొట్లోకి వెళ్ళేను.

టీకి ఆర్డర్ ఇచ్చి టేబిల్ మీదున్న పేపర్ తీసుకుని పేజీలు తిరగేస్తుంటే, చైర్మన్ రంగారావు మీద జరిగిన హత్యాప్రయత్నం కేసులో ముఖ్యనిందితుడు పాండురంగం పరారీలో వున్నట్టు, అతనికై పోలీసులు వెతుకుతున్నట్లు రాసిన న్యూస్ కనబడింది. తారీఖు చూసేను. అది పాత పేపరు. పేపర్ పక్కన పడేసి టీ తాగుతున్న నాకు నా వెనక ఎవర్లో పాండురంగం గురించి మాట్లాడుకోవటం వినిపించింది. వెనక్కి తిరిగి చూడకుండా వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో వినసాగేను.

''రంగన్నని మళ్ళీ ఇంకో కేసులో ఇరికించేడు చైర్మన్ రంగారావు. రామరాను వాడి ఆటలు ఎక్కువైపోతున్నాయి'' ఎవరో అన్నారు.

''రంగన్నని పోలీసులు ఎంత వెదికినా పట్టుకోలేరు... రంగన్న ఎక్కడున్నాడో ఎవరికీ తెలియదు.... వాళ్ల అమ్మకి కూడా తెలియదుట' అన్నారు మరొకరు.

''పాపం... రంగన్న తల్లిని పట్టుకుని వేధిస్తున్నారు పోలీసులు'' మరో కంఠం చెప్పింది.

''పోలీసులు డబ్బు, రాజకీయ పలుకుబడి వున్నవాళ్ళకి తొత్తుకొడుకులురా. ఆ రంగారావు దగ్గర డబ్బు తినటం... పాండురంగం మీద కేసు పెట్టడం... ఇంతకు తప్ప వాళ్ళకు ఇంకేం పని లేదనుకుంటా'' మొట్టమొదటి కంఠం చెప్పింది.

''నువ్వు చెప్పింది నిజంరా... ఈ పోలీసోల్లు మంచివారిని దొంగలంటారు... మంచి అనే ముసుగులో దొంగతనం చేసే రంగారావులాంటి వారిని మంచివాళ్ళంటారు'' రెండో కంఠం చెప్పింది.

''రంగారావు కేసు పెట్టినంత మాత్రాన పాండురంగం వెంటబడటమేనా... పోలీసులు మంచి ఏది చెడు ఏది కనుక్కోవద్దా... ఇలాంటి పోలీసులుండబట్టే మన దేశంలో అవినీతి ఎక్కువైంది. పాండురంగం దొరక్కుండా వుండాలి'' మొదటి కంఠం నెమ్మదిగా చెప్పింది.

''రంగన్న శంకరాపురంలో 'నాసు' దగ్గరుంటున్నాడని బస్టాండ్‌లో అనుకుంటున్నారు. అక్కడికి ఈ పోలీసులు వెళ్ళగలరా

జనం మీదబడి కొట్టరూ... పోలీసులేం కనుక్కుంటారు రంగన్న ఎక్కడున్నాడో'' ఇంకో కంఠం చెప్పటంతో నవ్వుకుంటూ నా వెనక మంచి నలుగురు లేచి వెళ్ళేరు.

''ఆ నలుగురూ మాట్లాడుకున్న దాన్ని బట్టి చూస్తే పాండురంగం శంకరాపురంలో వుండొచ్చు'' అనుకుని టీకి డబ్బులిస్తూ పాండురంగం గురించి ఇంకొంచెం తెలుసుకుందామని క్యాష్ కౌంటర్‌లో కూర్చున్న ఆయనతో ''నేను ఈ వూరికి కొత్త... ఆటోమోబైల్ బిజినెస్ మీద ఇక్కడికి వచ్చేను... ఇందాక ఎవరో మాట్లాడుకుంటూంటే విన్నాను. పాండురంగం చాలా మంచివాడుట కదా... మరి పేపర్లో పాండురంగం గురించి అంత చెడ్డగా రాసేరు... పెద్ద రౌడీ అని రాసేరు'' అని అడిగేను.

''ఆ చైర్మన్ రంగారావుని ఎదిరించేడు కదండి. అందుకని పోలీసులు రంగన్నకి ఆ 'రౌడీ' అనే బిరుదు ఇచ్చేరు. ఈ పోలీసోల్లు చెప్పిందే ఆ పేపర్ వాళ్ళు రాస్తారు... అసలు రంగన్న ఎవరు... అతను మంచివాడా చెడ్డవాడా అని ఈ గ్రామంలో విచారించి రాయొచ్చు కదా ఆ పేపర్ వాళ్ళు...

వాళ్ళకి కావలసింది న్యూస్ ఒక్కటే... ఆ చైర్మన్ రంగారావు దుర్మార్గుడండి... నిన్నగాక మొన్న నడిబొడ్డులో పాలేరు వెంకన్న భార్యను చెయ్యిపట్టుకు లాగేడు... మరి ఈ పోలీసులు రంగారావు మీద కేసు పెట్టరేం? మా రంగన్న వుంటేనా ఈపాటికి చైర్మన్ రంగారావు పని గోవిందా... మీరే చెప్పండి సార్... గాంధీ వీధిలో బరితెగించి అమ్మాయిలతో వ్యాపారం చేస్తున్న ఆ విశాలాన్ని ఇంతదాకా ఏమన్నా చేయగలిగేరా ఈ పోలీసులు... చేయరు... ఎందుకంటే ఆ బ్రోతల్ హౌస్ నడుపుతున్నది చైర్మన్ రంగారావే... ఈ రోజుల్లో మంచివాళ్ళకు చోటులేదు సార్... పాపం రంగన్న తల్లిని, చెల్లిని వదిలి ఎక్కడుంటున్నాడో'' క్యాష్ కౌంటర్లో వున్నతను చెప్పింది విని శంకరాపురం వెళ్ళాలని బస్‌స్టేషన్‌కి వెళ్ళేను.

* * *

బస్‌స్టేషన్‌కి చేరుకుని, టైమ్స్ బోర్డు దగ్గరకెళ్ళి శంకరాపురం వెళ్ళే బస్సు ఎన్నింటికుందో చూసేను... అక్షరాలు చెరిగిపోయి




## ఆరోగ్యానికి సిగ్గు

నేటి స్త్రీలు, వారి అమ్మమ్మల చర్మ సౌందర్యంతో పోలిస్తే తక్కువేనని కొందరు డాక్టర్లు మరియు మనస్తత్వ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆధునిక స్త్రీలు సౌందర్య వస్తువులు ఎక్కువగా ఉపయోగించడం మరియు సిగ్గుపడకపోవడం ఇందుకు కారణమై యుండవచ్చుని వీరు భావిస్తున్నారు. సిగ్గుపడటంవల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుందని, ఫలితంగా నునుపైన, ఆరోగ్యకరమైన చర్మం కలిగివుండే అవకాశం ఉంటుని తెలుస్తోంది

—పమ్మెట గోవర్ధన్

వుండటంతో ఎంక్వయిరీ కౌంటర్‌కి వెళ్ళేను. అక్కడెవరూ లేరు... పక్కనే కం[ట్రో]లర్ అని రాసున్న బోర్డు చూసి కం[ట్రో]లర్ దగ్గరికి వెళ్ళేను. "శంకరాపురానికి ఎన్ని గంటలకుంది బస్సు" ఎవరితోనో మాట్లాడుతున్న కం[ట్రో]లర్‌ని అడిగేను. నేనడిగిన దానికి సమాధానం రాకపోయేసరికి మళ్ళీ అడిగేను. వినిపించుకోనట్లు కూర్చున్న కంట్రోలర్‌తో ఈసారి కోపంగా అడిగేను. విసుగ్గా నా వంకచూసి "అరుస్తావెందుకు... నేను కం[ట్రో]లర్‌ని... అక్కడ 'ఎంక్వయిరీ' అని బోర్డు వుంటుంది. అక్కడకెళ్ళి అడుగు ... చూస్తే చదువుకున్నవాడిలా కనబడుతున్నావ్... ఆ మాత్రం తెలియదా" అరిచినంత పనిచేసేడు కం[ట్రో]లర్. నాకు ఒళ్ళు మండిపోయింది. కం[ట్రో]లర్‌కి బుద్ధి చెప్పుదామనుకున్నా... నేనొచ్చిన కార్యం చెడిపోతుందని... నాపనైన తరువాత పై ఆఫీసర్లతో ఈ కం[ట్రో]లర్ గురించి కంప్లయింట్ ఇవ్వచ్చునని నిర్ణయించుకుని అక్కడున్న ఒక ముసలాయన్ని అడిగేను శంకరాపురానికి బస్సు ఎన్నింటికుందో "నేనూ ఆ వూరే వెళ్తున్నా. అరగంట [క్రి]తమే రావల్సిన బండి. ఇంకా రాలేదు" ముసలాయన చెప్పాడు.

'ముసలాయన కూడా శంకరాపురం అంటున్నాడు... పాండురంగం [ఫ్రె]ండు 'నాగు' గురించి అడిగితే' అనిపించి "ఇప్పుడడిగితే ముసలాయన అనుమానపడొచ్చునని" మళ్ళీ అనిపించటంతో ముసలాయన్ని ఎలా అడగటం అని ఆలోచించిన నాకు ఒక ఆలోచన తట్టింది. 'వెరీ గుడ్' నన్ను నేను [ప్ర]శంసించుకుని శంకరాపురం బస్సుకై వెయిట్ చేసేను.

* * *

సిగరెట్ వెలిగించుకుని శంకరాపురం బస్సుకై వెయిట్ చేస్తున్న నాకు 'శంకరాపురం బస్సు' ఎవరిదో అరుపు వినిపించింది. సగం కాల్చిన సిగరెట్ కింద పడేసి, గబగబా జనం మూగిన శంకరాపురం బస్సు దగ్గరికి పరిగెత్తి జనాన్ని తోసుకుంటూ బస్సులోకి ఎక్కి సీటులో కూర్చుని నా పక్క సీటు ఇందాకటి ముసలాయనకి ఆపేను. అందరూ ఎక్కిన తరువాత నిదానంగా ఎక్కిన ముసలాయన్ని పిలిచి నా పక్కసీట్లో కూర్చోమన్నాను. నా పక్కన కూర్చుంటూ "థాంక్స్ బాబూ" వచ్చీరాని ఇంగ్లీషులో చెప్పాడు ముసలాయన.

బస్సు బయలుదేరబోతూంటే "శంకరాపురం ఎంత దూరం" అని ముసలాయన్ని అడిగేను.

"నాలుగు గంటల [ప్ర]యాణం బాబూ... నువ్వు శంకరాపురానికి కొత్తా" అడిగేడు ముసలాయన.

"అవునండీ... నాతోపాటు చిన్నప్పుడు చదువుకున్న నా స్నేహితుడిని చూడటానికి వెళ్తున్నా" అబద్ధం చెప్పాను.

"చిన్నప్పటి స్నేహితుడంటున్నావ్... నీకు స్నేహం విలువ తెలుసనుకుంటా... ఏం పేరు బాబూ నీ స్నేహితుడిది" అడిగేడు ముసలాయన.

"నాగూ అని..." అబద్ధం ఆడుతున్న

ట్టు తెలిసిపోతుందని ముఖం పక్కకు తిప్పుకుని చెప్పేను.

"నాగూ అంటే నాగేంద్రదేనా" అడిగేడు ముసలాయన.

"అవును" తలవంచుకుని బూట్ల లేసులు సరిచేసుకుంటూ చెప్పేను.

"జమీందారీ బంగళా ఎదురుగుండా వుంటున్న నాగేంద్రదేనా" మళ్ళీ అడిగేడు ముసలాయన.


"అవును... నాగేంద్ర మీకు తెలుసా" నాగేంద్రకి ముసలాయన బంధువేమోననే అనుమానంతో అడిగేను.

"ఎందుకు తెలియదు బాబూ... నాకే కాదు శంకరాపురంలో అందరికీ తెలుసు. ఆ పాండురంగం గురించి రోజూ పోలీసోళ్లు నాగేంద్ర ఇంటి చుట్టూతా తిరుగుతున్నారు కదా" ముసలాయన చెప్పింది విని "నా ప్లాన్ సక్సెస్" అనుకుంటూ "ఏ పాండురంగం" ఏమీ తెలియనట్లు అడిగేను.

"మీకు తెలియదా... అంటే నువ్వు రామాపురానికి కూడా కొత్తన్నమాట" అని అడిగిన ముసలాయనతో "నాది అసలు సీతాపురం. చిన్నప్పుడు చదువుకోసం రామాపురం వచ్చేవాడిని. అప్పుడు పరిచయం నాగేంద్ర. నేను ఆరోక్లాసు చదువుకుంటున్నప్పుడు, చదువుమానేసి మద్రాసు వెళ్ళిపోయేను. మళ్ళీ ఇప్పుడే రావటం... అందుకని ఎవ్వరూ పరిచయం లేదు" నోటికొచ్చింది చెప్పేను.

"అందుకే ఏ పాండురంగం అని అడిగేవు" నేను చెప్పిందంతా నిజమనుకొని చెప్పటం మొదలుపెట్టేడు ముసలాయన.

"రంగన్నంటే... అదే పాండురంగం అంటే ఒక్క రామాపురంలోనే కాదు... ఈ చుట్టుపక్కల గ్రామాలలో కూడా తెలియనివారుండరు. మనిషై పుట్టింతరువాత ఎదుటి మనిషికి చేతనైనంత సహాయం చేయాలని, మనిషి జన్మ ఎత్తినందుకు దాన్ని సార్థకం చేయాలని నిరూపించిన గొప్ప మనిషి బాబూ ఆ పాండురంగం... ఎక్కడ



కష్టం ఉందో అక్కడుంటాడు పాండురంగం. ఎంతో మందిని కష్టాల్లో ఆదుకొని మరో మహాత్ముడని నిరూపించుకున్నాడు... స్వార్థం అన్న పదానికి మానవజాతిలో అర్థం లేదని చెప్తూ ఎంతోమందిని తన వాక్చాతుర్యంతో నిస్వార్థపరులుగా తయారుచేసేడు. అటువంటిపాండురంగంని ఈ పోలీసులు అరెస్టు చెయ్యటానికి వెతుకుతున్నారు... ఇది కలికాలం కదా బాబు... మంచికి చోటులేదు'' బస్సులో ఎవరో సీటు కోసం గొడవపడుతూంటే ముసలాయన చెప్పటం ఆపేడు.

సీటు కోసం పోట్లాడుకుంటున్న వారు పోట్లాట ఆపటానికి అరగంట పట్టింది. పోట్లాట ఆగిపోవటంతో మళ్ళీ ముసలాయన పాండురంగం గురించి ఏదన్నా చెప్తాడేమోనన్న ఆశతో ముసలాయన్ని చూసేను. ముసలాయన నిద్దరలో ఉన్నాడు. లేపటం బాగుండదని కిటికీలోంచి ప్రకృతి సౌందర్యాన్ని తిలకించసాగేను.

రోడ్డు కిరువైపులా పచ్చని పైర్లతో శంకరాపురానికి వెళ్ళే దారి కళకళలాడుతోంది. బస్సు శంకరాపురానికి చేరుకునేటప్పటికి రాత్రి ఎనిమిదైంది. బస్సు దిగుతూ ముసలాయన్ని జమీందారీ బంగళాకి ఎటువెళ్ళాలని అడిగేను. ''తిన్నగా వెళ్ళి ఎడంచేతి వైపు తిరుగు. నీకే కనబడుతుంది'' అని చెప్పి తన దారిన తాను వెళ్ళిపోయేడు. బస్‌స్టేషన్‌లో రామాపురానికి లాస్ట్ బస్సు ఎన్నింటికో కనుక్కున్నాను. రిస్ట్‌వాచ్ వంక చూసేను. ఇంకో గంట టైముంది అనుకుని ముసలాయన చెప్పినట్టు తిన్నగా వెళ్ళి ఎడంచేతి వైపు తిరిగేను. సందు చివర పెద్ద భవనం కనబడింది. అక్కడికెళ్ళిన తరువాత భవనం ఎదురుగుండా దిష్టిబొమ్మలాగా చిన్న ఇల్లు కనబడింది. అదే నాగేంద్ర ఇల్లై వుంటుందని మూసివున్న తలుపుల మీద మెల్లిగా చేత్తో తట్టేను. ''వస్తున్నా'' లోపలి మంచి ఎవరిదో ఆడగొంతు వినబడింది. ఒక్క క్షణం అయినా ఎవరూ తలుపులు తెరవకపోయేసరికి మళ్ళీ తలుపు మీద తడదాం అనుకున్నా. ఇంతలో తలుపులు తెరచుకుని ఒక మధ్యవయస్కురాలు వచ్చి ''ఎవరు కావాలి'' అని అడిగింది.

''నాగూ ఉన్నాడా'' బాగా పరిచయమున్నవాడిలా అడిగేను.

''నాగూ ఇంట్లో లేదు. మీరు...'' నేనెవరని అడిగిన మధ్యవయస్కురాలితో ''నా పేరు ముకుందం... నేను లాయర్ని... పాండురంగంకు బాగా కావలసిన వాడిని. చాలా ముఖ్యమైన పని మీద వచ్చేను'' సంశయించకుండా చెప్పేను.

''ఉండండి... నాగూవాళ్ళ అమ్మని పిలుస్తా'' అని చెప్పి ఆ మధ్యవయస్కురాలు లోనికి వెళ్ళింది. పక్కనే అరుగుంటే అక్కడ కూర్చున్నాను. ఇంతలో ఆ మధ్యవయస్కురాలే వచ్చి ''లోపలికి రండి'' అని పిలిచి ఇంట్లోకి దారితీసింది. ఆమెతోటే లోనికి వెళ్ళిన నాకు కొంచెం వయస్సు మీరినావిడ కనిపించింది. ఆవిడ నన్ను చూసి ''రండి... కూర్చోండి'' అని కుర్చీ చూపిస్తూ ''నేను... నాగేంద్ర తల్లిని... ఈవిడ నాగు వదినగారు'' తన్నుతాను పరిచయం చేసుకుంటూ, ఆ మధ్యవయస్కురాలిని

కూడా పరిచయం చేసింది. నేను వాళ్ళిద్దరిని చూసి నమస్కారం చేస్తుంటే "నాగు బయట వూరు వెళ్ళేడు. ఎల్లుండి ప్రొద్దున్నకి కానీ రాడు... ఏం పనిమీదొచ్చారో చెపితే... మాకు చేతనైన సహాయం చేస్తాం" చాలా ఆత్మీయంగా అడిగింది నాగేంద్ర తల్లి.

"నేను పాండురంగంకి బాగా కావలసిన వాడిని. మద్రాసులో లాయర్‌గా వుంటున్నా ... పాండురంగం మీద తప్పుడు కేసులు పెట్టేరని తెలిసి పాండురంగంని కాపాడదామని వచ్చేను... పాండురంగం ఇంటికి వెళితే రంగారావుగారింట్లో గొడవ జరిగిన తరువాత ఇంటికి రాలేదని వాళ్ళ అమ్మగారు చెప్పారు... నాగూకి తెలిసుండొచ్చు అక్కడికి వెళ్ళు అని ఆవిడే చెప్పింది... అందుకే ఇక్కడికి వచ్చేను" ఏ మాత్రం అనుమానం రాకుండా చెప్పేను.

"మంచిది బాబు... పాండురంగంని ఎలాగైనా కాపాడు... ఈ చుట్టుపక్కల గ్రామ ప్రజలంతా నీకు గుడికట్టి పూజిస్తారు. 'మంచి' అనే మూడక్షరాల కంటే 'చెడు' అనే రెండక్షరాల మాటే సులువుగా వుందని డబ్బు, పలుకుబడి వున్న రంగారావులాంటి మనుషులు ఆ 'చెడు' అనే రెండక్షరాల మాటనే గౌరవిస్తున్నారు. 'చెడు' అనే రెండక్షరాల మాటకంటే 'మంచి' అనే మూడక్షరాల మాటే గొప్పదని ప్రచారం చేసిన పాండురంగం డబ్బు, పలుకుబడి వున్నవారికి చెడ్డగా కనిపించేడు. అదే పాండురంగం చేసిన తప్పు" ఒక్క క్షణం ఆగి "పాండురంగం ఎంత గొప్పవాడంటే... నెల రోజుల క్రితం బస్సు ప్రయాణంలో తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఆరేళ్ళ సుబ్బారాయుడి చదువు భారం తను తీసుకుంటూ, సుబ్బారాయుడిని పెంచి, కాపాడే బాధ్యత మా గ్రామ ప్రజలందరికీ వుందని నచ్చజెప్పి, గ్రామ ప్రజలందరూ చందాలేసుకుని సుబ్బారాయుడిని పైకి తీసుకొచ్చే బాధ్యత గ్రామ ప్రజలకు వుందని చెప్పి, వారిని ఒప్పించి గ్రామ పెద్ద ఇంట్లో సుబ్బారాయుడు వుండేట్లు చేసేడు పాండురంగం. అల్లాంటి గొప్ప మనసున్న పాండురంగం నీచుడని, రౌడీ అని ముద్రవేసి పాండురంగంని నానా బాధలు పెడుతున్నారు" కంటతడితో చెప్పింది నాగేంద్ర తల్లి.

"అందుకే పాండురంగంను కాపాడాలనే



**ఆపరేషన్**

ప్రమాణ స్వీకారం చేసిన కొత్త మంత్రిని—
"మొట్టమొదటగా మీరు ఏం చేయాలనుకుంటున్నారు' ' అడిగాడు విలేకరి.
"విదేశానికెళ్ళి ఆపరేషను చేయించుకోవాలనుకుంటున్నాను" వెంటనే చెప్పాడు మంత్రి.

—కె.వి.లక్ష్మి (బాపట్ల)

వచ్చేను... పాండురంగం ఎక్కడున్నాడో తెలుసుకోవాలి... అతనితో మాట్లాడాలి. కానీ పాండురంగం ఎక్కడున్నాడో తెలియటం లేదే" ఎక్కడున్నాడో వీళ్ళ తెలుసేమోననుకుంటూ అన్నాను.

"అదే మాకూ తెలియటం లేదు బాబూ... రంగారావు ఇంట్లో గొడవ జరిగిన తరువాత పాండురంగం ఇక్కడికి రాలేదు. ఒక పని చెయ్యి బాబూ... సీతాపురంలోని దమయంతి ఇంటికెళ్ళు. ఎవరికి తెలియకపోయినా దమయంతికి తెలిసుండొచ్చు" అంటున్న నాగేంద్ర తల్లితో "దమయంతి ఎవరూ?" అని అడుగుదామనుకుని "పాండురంగం చాలా పాపులర్ మనిషి కనుక దమయంతి కూడా అందరికీ తెలుసుంటుంది. సీతాపురం వెళ్ళి దమయంతి గురించి తెలుసుకోవచ్చు" అనుకుంటూ "అయితే.. అక్కడికే వెళ్తానండి" అని బయలుదేరిన నాతో "ఇంకాసేపట్లో మా పెద్దబ్బాయి వస్తాడు" నన్నుండమని చెప్పటానికి చెప్పింది.

"లేటైపోతే లాస్ట్‌బస్సు మిస్సవుతుంది.. ఈసారొచ్చినప్పుడు కలుస్తా... వస్తానండి" వెళ్ళొస్తానని నాగేంద్ర తల్లికి చెప్పి బస్‌స్టాండ్‌కి వచ్చేను.

ఇంకో పావుగంటలో రామాపురానికి బస్సుందని చెప్పేరు. అదే లాస్ట్ బస్సు. సీతాపురం వెళ్ళాలంటే రామాపురం మీదగానే వెళ్ళాలి. రాత్రికి లాడ్జిలో పడుకుని ప్రొద్దున్నే సీతాపురం వెళ్ళొచ్చు అనుకుంటూ సిగరెట్ వెలిగించుకుని రామాపురం బస్సు కోసరం వెయిట్ చేసేను. పావుగంట దాటింది, అరగంట దాటింది, గంట దాటింది. రామాపురం వెళ్ళే బస్సు రాలేదు. కనుక్కుందామని స్టేషన్ కంట్రోలర్ దగ్గరికి వెళ్తుంటే "రామాపురం బస్సు ఈ రోజు రాదట. బస్సు చెడిపోయిందట... ఇక ప్రొద్దున్నే ఫస్ట్ బస్సుకి వెళ్ళాల్సిందే" అన్న మాటలు వినబడి కంగారుపడి కంట్రోలర్ని అడిగేను. అతను కూడా అదే చెప్పేడు. గత్యంతరం లేక ఎదురుగుండా కనబడుతున్న టీ కొట్లోకి దూరి అక్కడ కనబడ్డ పదార్థాలు తిని, బస్‌స్టేషన్‌లోవున్న అరుగు మీద పడుకున్నాను.

మురుగుదొడ్డి కంపు, కావల్సినన్ని దోమలతో నాకు ఆ రాత్రి నిద్దర పట్టలేదు. ఫస్ట్ బస్సు నాలుగింటికి వున్నదని చెప్పటంతో నా రిస్ట్‌వాచ్ వంక చూసుకుంటూ, ఫస్ట్ బస్సు రావటంతో లేచి రామాపురం బస్సు ఎక్కేను. బస్సు మధ్య దారిలో ట్రబుల్ ఇవ్వటంతో ప్రొద్దున ఎనిమిదింటికి చేరవలసిన నేను రామాపురం చేరుకునేటప్పటికి పదకొండైంది. రూముకెళ్ళి స్నానంచేసి, భోజనం ముగించుకుని కొంచంసేపు రిలాక్స్ అవుదామని మంచం మీద వాలిపోయేను. రాత్రి సరిగ్గా నిద్ర లేకపోవటం వల్ల, ప్రయాణ బడలిక వల్ల నిద్రపోయిన నేను లేచేసరికి సాయంత్రం నాలుగైంది. వెంటనే బయలుదేరి బస్‌స్టేషన్‌కి వెళ్ళేను. నా అదృష్టమనుకుంటూ సీతాపురం బస్సు రెడీగా వుంది. ఎక్కి కూర్చున్నాను.

బస్సు అరగంటలో సీతాపురం చేరుకుంది. బస్సు దిగిన నన్ను 'రిక్షా కావాలా' అంటూ నలుగురు అడిగేరు. అందులో

కుర్రాడులా కనబడ్డ ఒక రిక్షావాన్ని పిలిచి "దమయంతి ఇల్లు తెలుసా?" అని అడిగేను

"తెలియక పోవటమేమిటి... దమయంతి ఇల్లు అంటే ఈ ఊర్లో ఎవరైనా చెబుతారు... ఆరు రూపాయలవుతుంది" వాడితో బేరమాడటం ఇష్టంలేక "సరే" అన్నాను.

రిక్షా చిన్నచిన్న వీధుల్లోంచి, గతుకుల రోడ్ల మంచి వెళుతోంది. దమయంతి గురించి ఆలోచించసాగేను. "దమయంతి ఇల్లు అంటే ఎవరైనా చెబుతారట. దమయంతి వేశ్యలాగుంది. అందరూ గొప్పవాడంటున్న పాండురంగంకు వేశ్యతో సంబంధం ఏమిటి... పాండురంగం ఒక నక్సలైటేమో. డబ్బున్నవాళ్ళ దగ్గర డబ్బు దోచుకుని, గ్రామ ప్రజలకి పంచిపెడుతున్నాడేమో. అందుకే గ్రామ ప్రజలందరూ పాండురంగంను మంచివాడంటున్నారు"

"సార్" అన్న రిక్షావాడి పిలుపుతో ఆలోచించటం మానేసిన నాతో "ఇదే సార్ దమయంతి ఇల్లు" రిక్షావాడు చెప్పాడు.

రిక్షాదిగి రిక్షావాడికి డబ్బులిస్తూ దమయంతి ఇంటివైపు ఒకసారి చూసేను. ఊరికి దూరంగా వున్న ఇల్లు పెద్ద బంగళా కాకపోయినా, ఖచ్చితంగా ఆ ఊరిలో పెద్ద ఇల్లే అనుకుని మూసివున్న గేటు తలుపు తీసుకుని లోపలికెళ్ళాను.

ఇంటి తలుపులు కూడా మూసి వుండటంతో తలుపు మీద చేత్తో కొట్టాను. కొంచంసేపాగిన తరువాత తలుపులు తెరుచుకుని పన్నెండేళ్ళ అమ్మాయి వచ్చి "ఎవరు" అంది.

"దమయంతి వుందా?" బాగా పరిచయమున్నవాడిలా అడిగేను.

"రండి" అని లోపలికి పిలిచి "అమ్మగారిని పిలుస్తానుండండి" అని చెప్పి లోపలికి పరిగెత్తింది.

'పనిపిల్ల లాగుంది' అనుకుంటూ ఆ హాలు చుట్టూ చూసేను. ఖరీదైన వస్తువులతో ఆ హాలు నిండిపోయి వుంది. 'ఎందుకుండదు ఖరీదైన వ్యాపారం చేస్తుంటే... సీతాపురం అనే పేరున్న ఈ ఊర్లో ఆ పేరు చెడపటానికి ఒక 'వేశ్య' అని అనుకుంటున్న




## సైన్స్ గ్రీటింగ్ కార్డులు

ప్రకృతి దృశ్యాలు, అందమైన నిర్మాణాలు గ్రీటింగ్ కార్డులపై సాధారణంగా కన్పిస్తుంటాయి. వైజ్ఞానిక సమాచారాన్ని గ్రీటింగ్ కార్డుల ద్వారా వ్యాప్తి చేయడానికై న్యూఢిల్లీకి చెందిన జె.పి.సోని సైంటిఫిక్ గ్రీటింగ్ కార్డులను రూపొందించారు. జీవ పరిణామం, డైనోసార్లు, ఆరోగ్యసూత్రం, వ్రతజని వలయం, సౌరకుటుంబం, తదితర విషయాలు వీటిపై సచిత్రంగా పొందుపరిచారు. పదహారు గ్రీటింగ్ కార్డుల ధర 30 రూపాయలు.

—పమ్మోట గోవర్ధన్

నాకు 'నమస్కారం' అంటున్న సన్నని గొంతు వినబడింది. పక్కకు తిరిగి చూసేను.

"కూర్చోండి" నవ్వు ముఖంతో కనబడ్డ దమయంతిని చూసిన తరువాత, దమయంతిని 'వేశ్య' అని నేను వేసుకున్న అంచనా తప్పనిపించింది. ఎర్రని పట్టుచీర, నిండుగా కప్పుకున్న పైట, ముఖానికి రూపాయి నాణెమంత బొట్టు, ముఖంలో ఉట్టిపడే అమాయకత్వం చూసి దమయంతి 'వేశ్య కాదు' 'పాండురంగం ఉంపుడుకత్తె అనుకుంటా' అనిపించింది నాకు.

"కూర్చోండి" ఇంకా నిలబడే వున్న నాతో చెప్పి "మీరెవరో తెలుసుకోవచ్చా" సోఫాలో కూర్చున్న నన్ను అడిగింది.

"నేను పాండురంగం కోసరం వచ్చేను.. నేను..." అని నేను చెప్పేలోపల "గెటవ్ అండ్ గెటౌట్" కోపంగా అరిచింది నావైపు చూస్తూ.

దమయంతి ఎందుకలా అరిచిందో అర్థం కాక, మళ్ళీ నేనెవర్నో చెప్పబోయేంతలో "ప్లీజ్ గెటౌట్... మీకు నన్ను వేధించటమే పని అనుకుంటా... పాండురంగం ఇక్కడ లేదు. ఎక్కడున్నాడో నాకు తెలియదు అని ఎన్నిసార్లు చెప్పాలి మీకు... ఇప్పటికి పదిసార్లు నా ఇంటికొచ్చేరు మీ పోలీసులు... నా ఇల్లు వెతికేరు... నా ఇంటికి కాపలా పెట్టేరు... అయినా మీరు నమ్మటంలేదు.. మీ పోలీసోల్లని ఎలా నమ్మించాలో నాకు తెలియటంలేదు... దయచేసి వెళ్ళిపొండి. మళ్ళీ, మళ్ళీ వచ్చి నన్ను విసిగించకండి... పాండురంగం ఇక్కడికి రాలేదు. ఎక్కడున్నాడో నాకు తెలియదు" కళ్ళెర్ర చేసుకుని గట్టిగా చెప్పింది.

"నేను చెప్పేది కాస్త వింటారా" అంటున్న నాతో, "విని, విని నా చెవులు చిల్లులు పడిపోయాయి. మీరేం చెప్పినా వినే పరిస్థితిలో లేను.,. అసలు వినదలచుకోలేదు ప్లీజ్ నన్ను వేధించకండి... పాండురంగం ఎక్కడున్నాడో నిజంగా నాకు తెలియదు" వెళ్ళిపొమ్మని ప్రాధేయపడుతూ చెప్పింది దమయంతి.

"దమయంతి మూడ్‌లో లేనట్టుంది... ఇప్పుడేం చెప్పినా వినదు... ప్రొద్దున్నే రావచ్చులే" అనుకుని వెళ్ళిపోదామని సోఫాలోంచి లేస్తూ "పాండురంగంను కాపాడటానికి వచ్చేను... నేను పోలీసోన్ని కాదు" అని విసురుగా దమయంతికి చెప్పి గుమ్మందాకా వచ్చిన నాకు "ఆగండి" అన్న దమయంతి గొంతు వినబడింది.

ఆగిపోయిన నా దగ్గరకు దమయంతి వచ్చి "నిజంగా మీరు పోలీస్‌వాళ్ళు కాదా?" అని అడిగింది.

"కాదు... నేను లాయర్ని. మద్రాసులో వుంటున్నాను. రామాపురం నుంచి కొందరు నా దగ్గరకొచ్చి పాండురంగం చాలా మంచివాడు. పాండురంగంను ఎలాగైనా కాపాడండి అని అడిగేరు... ఆ విషయం మీదే ఇక్కడికి వచ్చేను" తొణుకు, బెణుకు లేకుండా చెప్పేను.

"క్షమించండి. వారం రోజుల నుంచి నా ఇంటి చుట్టూతా తిరుగుతూ నన్ను చిత్రవధ చేసేరు పోలీసులు. మిమ్మల్ని కూడా పోలీసోళ్ళనుకున్నా... అయ్యో... మిమ్మల్ని

నిలబెట్టే మాట్లాడుతున్నా...

క్షమించండి'' నేను చెప్పిందంతా నిజమను కుని, క్షమించమని ప్రాధేయపడుతూ, నన్ను కూర్చోమని చెప్పింది దమయంతి.

పాండురంగంను కాపాడతావని నేను చెప్పేటప్పటికి దమయంతిలో వచ్చిన మార్పును చూసేసరికి నాలో సంతోషం పెరిగింది. ''తప్పక దమయంతి, పాండురంగం ఎక్కడున్నాడో చెప్తుంది'' అనే నమ్మకం పెరిగింది.

సోఫాలో కూర్చున్న నాతో ''ఇప్పుడు మద్రాసు నుండి వస్తున్నారా?'' అని అడిగింది దమయంతి.

''లేదు... శంకరాపురంలో నాగేంద్రని కలుద్దాం అని వెళ్ళేను. నాగేంద్ర వూళ్ళో లేడు. నాగేంద్ర తల్లి నిన్ను కలుసుకోమని చెప్పింది. పాండురంగంని కాపాడాలంటే, ముందు నేను పాండురంగంతో మాట్లాడాలి ... పాండురంగంకు మీకు వున్న సంబంధం తెలుసుకోవచ్చా'' సంశయిస్తూ అడిగేను.

''చెప్తాను... ప్రయాణం చేసి బాగా అలసటగా కనిపిస్తున్నారు. స్నానంచేసి, టిఫిన్ తిన్న తరువాత తీరికగా మాట్లాడుకుందాం'' అని నాతో చెప్పి, పనిపిల్లని పిలిచి స్నానానికి ఏర్పాట్లు చేయమని చెప్పి నాకు టవలు, లుంగీ తేవటానికనుకుంటా రూములోకి వెళ్ళబోయింది దమయంతి.

''నేను... అర్జంటుగా వెళ్ళాలి'' ఎక్కువసేపు అక్కడుండటం మంచిది కాదనుకుని అన్నాను.

''మాడండి... పాండురంగంకు కావలసిన వాళ్ళంతా నాకూ ఆత్మీయులే... అందులోను-మీరు పాండురంగంను కాపాడటానికి వచ్చినవారు... మీకు నేను ఆతిథ్యం ఇవ్వకపోతే... ఆ దేవుడు నన్ను క్షమించడు.... మీరు ఈ రాత్రికి ఇక్కడుండి... రేపొద్దున్నే వెళ్ళాలి'' నేనేం చెప్తానో వినకుండా, తను చెప్పవలసింది చెప్పి, రూములోకెళ్ళి నేనను



కున్నట్లుగానే లుంగీ, టవల్ తీసుకొచ్చి "స్నానానికి లేవండి" అంది దమయంతి.

దమయంతి అభ్యర్థనను కాదవలేక, దమయంతి అందించిన టవల్, లుంగీ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళేను.

స్నానం చేస్తుంటే "దమయంతి తప్పక పాండురంగంకు ఉంపుడుకత్తే. పాండురంగం తప్పకుండా దమయంతి ఇంట్లో లేడు. కానీ పాండురంగం ఎక్కడున్నాడో ఖచ్చితంగా దమయంతికి తెలుసు. అదే రాబట్టాలి. దమయంతికి నేను పోలీసువాడ్ని అన్న విషయం అనుమానం రాకుండా జాగ్రత్తగా నడుచుకోవాలి" అనుకుని స్నానం ముగించుకుని వచ్చిన నాతో "రండి... టిఫిన్ రెడీ" అంటూ నన్ను పిలిచి డైనింగ్ టేబిల్ దగ్గరకు వెళ్ళింది.

వేడివేడి పకోడీలు, బజ్జీలు పెట్టింది. వద్దని వారిస్తున్నా దగ్గరి ఆత్మీయునివలే దగ్గరుండి రెండు మూడు ప్లేట్లు ఖాళీ చేయించింది. టిఫిన్ తిని, దమయంతి ఇచ్చిన కాఫీ తాగి, సిగరెట్ వెలిగించుకున్న నన్ను 'రండి' అంటూ తన బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళింది.

దమయంతి చూపించిన కుర్చీలో కూర్చుంటూ, బెడ్‌రూమ్ అంతటిని కలియజూసేను. ఖరీదైన డబుల్‌కాట్, అందమైన ఆల్విన్ రిఫ్రిజిరేటర్, మనిషంత ఎత్తున్న డ్రస్సింగ్ కబోర్డ్, గోడలకు అద్భుతమైన చిత్రపటాలు, అన్నీ చూసిన నా కళ్ళు ఒక పెద్ద ఫోటో దగ్గర ఆగిపోయాయి. ఆ ఫోటో పోలీస్ రికార్డ్సులో వున్న పాండురంగం ఫోటో... చాలా పెద్దది.

"నేనే పెట్టించేను ఆ ఫోటోని" నా చూపులు గమనించిన దమయంతి "ఎందుకంటే ప్రొద్దున్నే లేవగానే దేవుడి ఫోటో చూడాలని" చెప్పింది నాతో.

పాండురంగంను దేవుడితో పోల్చిన దమయంతిని ఆశ్చర్యంగా చూసేను.

ఆశ్చర్యంగా చూస్తున్న నాతో "అవును... పాండురంగం నాకు దేవుడే... ఇందాకడిగేరు నాకూ, పాండురంగంకు వున్న సంబంధం ఏమిటని... దేవుడికి, భక్తురాలికి వున్న సంబంధమే నాకూ, పాండురంగంకు వుంది ఈ విషయం ఈ చుట్టుపక్కల గ్రామాలలో ఎవర్ని అడిగినా చెప్తారు. ఒక్క పోలీసోళ్లు, చైర్మన్ రంగారావు, రంగారావు పెంచుతున్న కుక్కలు తప్ప... వాళ్ళకి మాత్రం నేనొక వేశ్యను పాండురంగం ఉంపుడుకత్తెను" ఏమిటి చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది దమయంతి.

నేనేమీ మాట్లాడకపోయేసరికి "అర్థం కావడం లేదు కదూ... నేను పాండురంగంను దేవుడన్నాను ఎందుకో తెలుసా... ఈ మానవ లోకంలో అతనే నిజమైన మనిషి కాబట్టి... ద్రౌపది మానాన్ని కాపాడిన కృష్ణపరమాత్ముడు, పాండురంగం ఒకటే కాబట్టి... పాండురంగం నా మానాన్నే కాకుండా నా శీలాన్ని కాపాడిన ఒక దేవుడు... నేనెవరో తెలుసా... ఆ కిరాతకుడున్నాడే... అదే... చైర్మన్ రంగారావు... వాడి మరదల్ని... స్వయానా రంగారావు తమ్ముడు పాపారావ్ భార్యను" అని చెప్పిన దమయంతిని చూసి షాక్ తిన్నాను.

"అవును... ఆ కిరాతకుడి మరదల్ని...

ఆస్తి కోసం నా భర్తను హత్యచేసి, ఆ హత్యను ఒక ఆత్మహత్యగా చిత్రీకరించేడు ఆ కిరాతకుడు... నా భర్తకు పాండురంగం అంటే చాలా గౌరవం.

ఎందుకంటే రంగారావు చేసే పాపపు కార్యాలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు పాండురంగం... అన్నగారు చేసే చెడ్డపనులను ఎదుర్కోవడానికి పాండురంగంతో చేతులు కలిపేడు నా భర్త... అది ఓర్వలేని రంగారావు నాకూ, పాండురంగంకు చెడు సంబంధం అంటగట్టి ప్రచారం చేసేడు. అన్నీ ఓర్చుకున్న నా భర్త రంగారావు చేసిన ఈ పాడుపనిని, గట్టిగా ఎదుర్కోవాలనే ఉద్దేశంతో రంగారావుతో కయ్యానికి దిగేడు. అది తట్టుకోలేక, తన దోవకు అడ్డువచ్చే నా భర్తను తొలగించాలని, తొలగించి ఆస్తిని కాజేయాలని, ఒక పథకం వేసి ఒకరోజు నా భర్తను వెంబడించి మేడమీదినుంచి క్రిందకు తోసి చంపేసేడు... నాకూ, పాండురంగంకు వున్న చెడు సంబంధం వల్లే నా భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారం చేసి, తన రాజకీయ పలుకుబడితో హత్యను ఆత్మహత్యగా మార్చగలిగేడు రంగారావు.

భర్తపోయిన నన్ను తన రాజకీయ నాయకులకు, పోలీసు ఆఫీసర్లకు ఆనందాన్ని అందించే ఒక ఆటబొమ్మగా వేయాలనుకున్నాడు. అప్పుడు పాండురంగం తన ప్రాణాలకి తెగించి నన్ను, నా ఆస్తిని కాపాడి తన ప్రజాబలంతో .రంగారావుని ఎదుర్కొని, ఇదిగో నన్ను ఇక్కడికి చేర్చేడు. ఒంటరిగా వున్న నన్ను తన సోదరిలా చూసుకున్నాడు పాండురంగం. వీలున్నప్పుడల్లా తను వస్తూ, తను రాలేని సమయంలో తన స్నేహితులను పంపుతూ నా బాగోగులు కనుక్కుంటూ ఆ రంగారావు నుంచి నాకు ఏ హానీ రాకుండా చూసుకుంటున్నాడు. అందుకే పాండురంగం నాకు దేవుడు. ఈ మానవలోకంలో అన్ని దుష్టశక్తులను ఎదుర్కొన్న పాండురంగం నాకూ, ఈ గ్రామ ప్రజలకీ దేముడుకాక ఇంకేం అవుతాడు. మరి అటువంటి పాండురంగంను రంగారావు పోలీసుల సహాయంతో ఏరి పారేయాలని చూస్తున్నాడు. అది జరిగేపనా దేవుడిని ఎదుర్కోటం మానవునికి అందులోను చెడు ఆలోచనలున్న రంగారా

## అనుమానం



"కామేశం అనుమానం భర్తని నీకెలా తెలుసు?" అడిగాడు సుబ్బారావు అప్పారావుని.

"అతనిది మా ఎదురిల్లే — కావాలని అర్ధరాత్రి పూట యింటికొచ్చి తలుపు తడతాడు. భార్య తలుపు తీస్తే — పరాయి మగాడనుకుని తీశావు కదూ అంటూ సాధిస్తాడు" చెప్పాడు అప్పారావు.

—కె.సి.బాబు (నెల్లూరు)

వుకి సాధ్యమా. సాధ్యం కాదూ... కాకూడదని ముక్కోటి దేవతలకి మొక్కుకుంటున్నాను. మనసులోనుంచి పొంగుకొస్తున్న ఏడుపును ఆపుకోలేక ఏడుస్తూ చెప్పింది దమయంతి.

దమయంతి చెప్పిందంతా నిజమనిపించింది నాకు. నన్ను నేను తిట్టుకున్నాను. "అనవసరంగా నిజా నిజాలు తెలుసుకోలేక దమయంతిని ఒక వేశ్యగాను, పాండురంగం పుంపుడుకత్తెగాను చిత్రించుకున్నాను. నన్ను క్షమించు భగవంతుడా" మొట్టమొదటిసారిగా దేవుడిని క్షమించమని అడిగేను మనసులో. అదే మనస్సుతో 'నన్ను క్షమించుదమయంతీ' అనుకుని ఏడుస్తున్న దమయంతిని ఓదార్చాలని, అదే సమయంలో నా డ్యూటీని నిర్వర్తించాలని దమయంతితో "చూడండి మంచివాళ్ళకే అడ్డంకులొస్తాయి చెడ్డవాడు ఎంత బలవంతుడైనా మంచివాడి చేతిలో ఏదో ఒకరోజు ఓడిపోవాల్సిందే. అదే దైవశక్తి, కౌరవులని గెలవటానికి పాండవులు ఎంత కష్టపడ్డారో మీకు తెలుసు అలాగే; రంగారావుని గెలవటానికి పాండురంగం కొన్ని కష్టాలు పడాలి కానీ చివరికి విజయం పాండురంగందే. మీరు అనవసరంగా బాధపడకండి. ధైర్యంగా ఉండండి. పాండురంగంకు అన్నివిధాలా సహాయంగా వుండాలనే నేనిక్కడకు వచ్చేను. పాండురంగం నిర్భయంగా రంగారావుని ఎదుర్కొంటే నేను నా లాయర్ తెలివితేటలు వుపయోగించి పోలీసులను ఎదుర్కొంటాను. అప్పుడు విజయం పాండురంగందే. వీటన్నిటికీ ముందు పాండురంగం ఎక్కడున్నాడో కనుక్కోవాలి. మీరూ పాండురంగం ఎక్కడుంటున్నాడో తెలియదంటున్నారు. ఇప్పుడు పాండురంగంను కలిపేదెలా. కాపాడేదెలా? అదే నన్ను బాధపెడుతోంది" బాధ నటిస్తూ చెప్పాను.

నా బాధను చూసి నిజమనుకుందేమో దమయంతి "బహుశా పాండురంగం దశరథపురం కొండలోయల్లో ఉండచ్చు. అక్కడికి పోలీసులు వెళ్ళలేరు... ఒకవేళ వెళ్ళినా అక్కడున్న కోయజాతివారు దాడిచేస్తారు. దాగటానికి ఆ కొండలోయల్లో వారు పాండురంగంని దాచేస్తారు... దాగటానికి ఆ కొండ లోయల్లో చాలా చోట్లున్నాయి... ఎవ్వరూ కనుక్కోలేరు. కనుక్కోవాలంటే ఆ కోయజాతివారి సహాయం కావాలి... ఎన్నో విధాలుగా ఆ కోయజాతివారికి పాండురంగం చాలా సహాయం చేసేడు. అందుకని వాళ్ళు పాండురంగంను కాపాడతారు. పోలీసుల బాధనుండి తప్పించుకోవటానికి పాండురంగం ఒకటి రెండుసార్లు ఆ కోయజాతివారి దగ్గరకు వెళ్ళేడు. తప్పకుండా ఇప్పుడుకూడా అక్కడే వుంటాడు. అందుకని మీరు అక్కడికి వెళ్ళండి. మీరు అక్కడికి వెళ్ళే దోవలోనే కోయజాతివారు మీకు ఎదురుపడి మీ మీద అఘాయిత్యం చెయ్యవచ్చు... అందుకని" అని చెప్పడం ఆపి ప్రక్కనున్న కబోర్డ్ తెరిచి ఒక గుడ్డని తీసి నా కందించి "ఆ కోయజాతివారికి ఈ గుడ్డ చూపించండి. వాళ్ళు మిమ్మల్ని పాండురంగం దగ్గరికి తీసుకెళతారు" అని చెప్పడం ముగించింది దమయంతి.

దమయంతి ఇచ్చిన గుడ్డను చూసేను. తెల్లగుడ్డమీద ఎర్రరంగు బార్డర్ వుంది "దీనికి అర్థమేమిటి" అని అడిగేను.

"తెల్లగుడ్డ శాంతికి చిహ్నం" ఆ శాంతిని నెలకొల్పటానికి అవసరమైతే నెత్తురు చిందించాలనే ఆ ఎర్రరంగు బార్డర్... ఈ విషయం ఒక్క పోలీసోళ్లకు తప్ప మిగతా గ్రామ ప్రజలకు తెలుసు... పాండురంగం నెలకొల్పాలనుకున్న రామరాజ్యంకు ఇదే జెండా" గర్వంగా చెప్పింది దమయంతి.

దమయంతి ఇచ్చిన గుడ్డను ప్యాంటు జేబులో పెట్టుకుంటూ "చాలా థాంక్స్ అండి... నేను వెంటనే దశరథపురం బయలుదేరుతాను వస్తాను" అని బయలుదేరబోయిన నాతో "ఇప్పుడెక్కడికి వెళతారు" టైమెంతైందో తెలుసా... పదకొండు అన్న దమయంతి మాటలతో నా రిస్ట్ వాచ్ వంక చూసేను. టైము పదకొండూ పది అయింది. "అంటే దాదాపు ఆరుగంటలు దమయంతితో మాట్లాడేను" అనుకుంటున్న నాతో "రామాపురం వెళ్ళే లాస్ట్ బస్సు కూడా వెళ్ళిపోయింది. ఈ రాత్రికి ఇక్కడుండి రేపు ప్రొద్దున్నే వెళ్ళండి. దశరథపురం వెళ్ళే బస్సు రామాపురం మీదనుంచే వెళుతుంది" అని నాతో చెప్పి పనిపిల్లను పిలిచి నాకు మేడమీద పక్క ఏర్పాట్లు చెయ్యమని చెప్పి రండి ... భోజనం చేద్దాం" అంది.

"భోజనమా... నావల్లకాదు... ఇందాక టిఫిన్ చాలా తిన్నాను... ఇంకిప్పుడేం తినలేను... ప్లీజ్ నన్ను బలవంతం చేయకండి" కడుపు నిండుగా వుండటంతో చెప్పాను

"సరేలెండి... పనిపిల్లతో పండ్లరసం పంపిస్తాను... మీరెళ్లి రిలాక్స్ అవండి" అని దమయంతి చెప్పటంతో "రక్షించేవు భగవంతుడా" అనుకుంటూ మేడమీద నాకిచ్చిన రూముకి వెళ్ళేను.

పనిపిల్ల తెచ్చిన పండ్లరసం తాగి మంచం మీద వాలిపోయిన నాకు ఎప్పుడునిద్దరపట్టిందో తెలియదు. పనిపిల్ల లేపటంతో రిస్ట్‌వాచ్ వంక చూసేను. అప్పటికే టైము ఏడైంది. గబగబా స్నానంచేసి, దమయంతి ఇచ్చిన కాఫీ




## కల్తీలేని కూరలు

పెరుగుతున్న జనాభాకు తగిన ఆహారోత్పత్తికి అధిక దిగుబడి వంగడాలు, కృత్రిమ ఎరువులు, కీటక నాశన ఔషధాలు వాడటంవల్ల ఆహార పదార్థాల్లోకి విషరసాయనాలు చేరుతున్నాయి. కలుషిత ఆహారం వ్యాధులను కలిగిస్తోంది. ఒక్కోసారి ప్రాణహాని జరగవచ్చు. కలుషితం కాని ఆహారం ప్రాముఖ్యత తెలుసుకొన్న ప్రజలు, దాని కోసమై ఎంత ధర చెల్లించడానికైనా సిద్ధమవుతున్నారు. ప్రకృతిసిద్ధంగా, కృత్రిమ ఎరువులు ఉపయోగించకుండా పండిన ఈ ఆహారానికి పశ్చిమజర్మనీ ప్రజలు, మామూలు ధర కన్నా మూరుమండి మూటాయాభైరెట్లు ఎక్కువ చెల్లించడానికి వెనుకాడడంలేదు.

—సమ్మెట గోవర్ధన్

్రతాగి బయలుదేరిన నన్ను గేటుదాకా వచ్చి సాగనంపిన దమయంతి నేను గేటు తెరుచుకుని రోడ్డుమీద కెళుతుంటే కన్నీటితో "పాండురంగంను ఎలాగైనా కాపాడండి" చేతులు జోడించి చెప్పింది.

"తప్పకుండా" అని దమయంతికి చెప్పి, బస్సుస్టేషన్‌కు వచ్చేను..." రామాపురంలో దిగవవసరం లేదు... డ్రస్సుకూడా బాగానే వుంది అనుకుని దశరథపురం బస్సుకోసం వెయిట్ చేశాను. అరగంటలో దశరథపురం వెళ్ళే బస్సు వచ్చింది. ఖాళీగా వుండటంతో ముందుసీట్లో కూర్చున్నాను.

నాలుగు గంటలు కష్టపడి ప్రయాణం చేసిన తరువాత దశరథపురం చేరుకున్నాను. బస్సుస్టేషన్‌లోంచి చూస్తే ఒక్కటే కొండ కనబడింది. బహుశ దమయంతి చెప్పిన కొండ అదే కాబోలు, బస్సుస్టేషన్‌కి కొండ చాలా దూరంలో వుంది. తప్పదు... వెళ్ళాలి ఒప్పుకున్న డ్యూటీ చేయటానికి ఎంతైనా కష్టపడాలి... అనుకుంటూ కొండవైపు నడవసాగేను.

రెండు గంటలు నడిచిన తరువాత కొండంత దగ్గరగా కనబడింది. ముళ్ళపొదలు మొదలైనాయి. చిన్న చిన్న దారులలో ముళ్ళపొదలను తప్పించుకుంటూ నడవసాగేను. కొండ దగ్గరవటంతో మనసులో సంతోషం మొదలైంది... ఇంతలో సడన్‌గా ముళ్ళపొదల్లోంచి ముగ్గురు కోయవాళ్ళు నాకెదురొచ్చేరు... వాళ్ళ చేతుల్లో సూలాల్లాంటి కర్రలున్నాయి. వెంటనే దమయంతి ఇచ్చిన గుడ్డను నా జేబులోంచి తీసి వాళ్ళకు చూపించాను. అంతే ఆ గుడ్డను చూసిన వాళ్ళు ముగ్గురూ మోకాళ్ళపై కూర్చుని నాకు నమస్కారం పెట్టేరు. "రండి" అన్నట్లు చేతులతో సైగ చేసి నన్ను ఆహ్వానించేరు.

ఆ ముగ్గురితో కలిసి కొండ ప్రాంతానికి వెళ్ళేను. నన్ను ఒక గుడిసకెదురుగా నిలబెట్టి ముగ్గురిలో ఒకరు లోపలికెళ్ళి కొంచం వయస్సులో వాళ్ళకంటే పెద్ద కోయవాడ్ని పిలుచుకొచ్చేరు. బహుశ వాళ్ళ నాయకుడను కుంటా, అతను నా చేతిలోవున్న గుడ్డను చూసి "కూర్చోండి" కోయవారి రాగంతో తెలుగులో చెప్పేడు.

పక్కనున్న అరుగుమీద కూర్చున్న నాతో "ఏటి బాబూ... రంగన్న ఏమైనా ఇచ్చి పంపాడా" అని అడిగేడు.

"అంటే పాండురంగం వీళ్ళకు డబ్బు, బంగారం, ఆహార వస్తువులూ ఇచ్చి పంపిస్తున్నాడన్నమాట... అందుకే వీళ్ళు పాండురంగం మనుషులయ్యేరు" అనుకుంటూ "లేదు... ఏమి ఇవ్వలేదు... అసలు పాండురంగం కనిపిస్తేనేగా ఏదన్నా ఇవ్వటానికి... ఆ రంగారావుగాడివల్ల పోలీసులు పాండురంగం కోసరం అన్నిచోట్ల గాలిస్తున్నారు... నన్ను దమయంతి పంపింది. నేను లాయర్ని. పాండురంగంను కాపాడాలని వచ్చేను. అతనితో మాట్లాడితేనే అతన్ని కాపాడగలను. ఇక్కడుండొచ్చని దమయంతి నన్నిక్కడికి పంపింది" కోయ నాయకుడికి అనుమానం రాకుండా చెప్పేను.

నేను చెప్పింది విని "నాయాల... ఆ రంగారావు కొడుకు... మళ్ళీ మా రంగన్న మీద కేసు పెట్టాడా... ఆ రంగారావుని

ఆరోజే చంపేయమని చెప్పేను... రంగన్న వినలేదు... మన కార్యక్రమం చంపటం కాదు... మనుషులని మార్చటం అన్నాడు. మనుషులను మార్చటం తేలికకాదు దొరా అంటే విన్నాడా... ఆ రంగారావుని..." కోపంగా ఏదో చెప్పబోయి "రంగన్న ఈడకి రాలేదు బాబూ... ఇక్కడికే రావాలి... మరెందుకు రాలేదో" ఇంకెక్కడికి వెళ్లుంటాడో అని ఆలోచనలో పడ్డట్టున్నాడు కోయ నాయకుడు.

కోయ నాయకుడు నిజమే చెప్తున్నాడనిపించింది "సరే. ఒకవేళ పాండురంగం వస్తే దమయంతి ఇంటికి కబురు పంపించు నేను అక్కడే వుంటాను. వస్తా" అని అరుగుమీదనుంచి లేచేను.

"బాబూ... మా రంగన్నని ఎలాగైనా కాపాడండి" దన్నంపెడుతూ చెప్పేడు.

"ముందు పాండురంగంతో మాట్లాడనీ" అని చెప్పి, ముళ్ళపొదలు దాటుకుంటూ నెమ్మదిగా దశరథపురం బస్సుస్టేషన్ చేరుకున్నాను.

బస్సు స్టేషన్‌లో బల్లమీద కూర్చుని సిగరెట్టు వెలిగించుకుని ఆలోచనలో పడ్డాను.

"పాండురంగం ఆచూకీ ఎంత కష్టపడ్డా తెలియటం లేదు. ఈ కొండ, లోయలు, ఈ కోయజాతి వారికంటే, తల దాచుకోవటానికి పాండురంగంకు ఇంతకంటే మంచి చోటు, మంచి మనుషులు ఎవరుంటారు. ఇప్పుడేం చేయాలి... రంగన్న అని పిలవబడే ఈ పాండురంగం చాలామంచివాడులా కనబడుతున్నాడు. అందరూ పాండురంగం గురించి మంచిగానే చెప్పారు. దమయంతి చెప్పింది విన్న తరువాత అంతవరకు పాండురంగం మీదున్న చెడు అభిప్రాయం పటాపంచలైపోయింది. వీళ్ళందరూ పాండురంగం మనుషులనుకుందాం.. టీ కొట్లో పాండురంగం గురించి మాట్లాడుకున్న నలుగురూ, క్యాష్ కౌంటర్లో కూర్చున్న ఆయన... శంకరాపురం వెళ్ళేప్పుడు బస్సులో పరిచయ



మైన ముసలాయన ఖచ్చితంగా పాండురంగం మనుషులు కారు. కాబట్టి పాండురంగం చాలా మంచివాడు.. మరి పోలీసు రికార్డ్సులో పెద్దకేడీ అని రాసేరు... రాస్తారు కొందరు పోలీసు ఆఫీసర్లు రాజకీయ నాయకులకు భయపడి అలా రాస్తారు. ఆ రకం ఆఫీసర్లే పాండురంగం ఫైలు తయారు చేసుండచ్చు. .. రాజకీయ నాయకులకు భయపడి ఒక మంచివాడి జీవితం నాశనము చేయటమా..

అలా జరగకూడదు... పాండురంగంను ఎలాగైనా కాపాడాలి... పాండురంగం కనబడితే అతన్ని కాపాడతానని మాటిచ్చి... అతన్ని లొంగిపొమ్మని బ్రతిమలాడి... కోర్టులో హాజరుపరిచి... నా స్వంత జామీనుమీద బయటకు తీసుకొచ్చి, పాండురంగంతో కలిసి ఆ రంగారావుని బంధించి, రంగారావుని చట్టానికి ఒప్పచెప్పాలి. రంగారావు దమయంతి భర్తను హత్యచేసినట్టు నిరూపించి, ఆ దుర్మార్గుడిని ఉరి కంబం ఎక్కించాలి

రంగారావుతో చేతులు కలిపిన పోలీసు ఆఫీసర్లని దండించాలి'' అని దృఢంగా నిశ్చయించుకుని ఈసారి పాండురంగం కోసరం నా పరిశోధనని పాండురంగం తల్లినుంచి ఆరంభించాలని రామాపురం బస్సు ఎక్కేను.

రామాపురం చేరుకునేటప్పటికి సాయంత్రం ఏడైంది. తిన్నగా పాండురంగం ఇంటికెళ్ళేను. తలుపులేసున్నాయి. తలుపులు తట్టేను పాండురంగం చెల్లి అనుకుంటా తలుపులు తెరిచి ''ఎవరు కావాలి'' అని అడిగింది.

''పాండురంగం ఇల్లు ఇదేనా'' అని అడిగిన నన్ను ''ఇదే... లోపలికి రండి'' అంటూ లోపలికి దారితీసి, అక్కడున్న కుర్చీ చూపిస్తూ ''కూర్చోండి'' అని చెప్పి''అమ్మా... అన్నయ్యకోసం ఎవరో వచ్చేరు'' అని లోపలున్న పాండురంగం తల్లిని పిలిచింది.

కుర్చీలో కూర్చున్న నాకు లోపలినుంచి పాండురంగం తల్లి కనబడింది. ఆ తల్లిని చూసిన వెంటనే నాకు తెలియకుండానే నేను కుర్చీలోంచి లేచి నమస్కారం చేసేను. ప్రతి నమస్కారం చేస్తూ ''కూర్చో బాబూ ... మా అబ్బాయి కోసరం వచ్చేవా'' ఆవిడ కంఠంలో ఎక్కడా పాండురంగం కనబడలేదనే బాధ కనబడలేదు నాకు. బహుశ ఏడ్చి, ఏడ్చి ఆవిడ కంట నీరు, గొంతు బొంగురు ఆరిపోయి వుంటుంది అనుకుని ''అవునండి ... దమయంతి పంపించింది నన్ను, పాండురంగంను ఎలాగైనా కాపాడలనే తాపత్రయంతో... నేనొక లాయర్ని... పాండురంగం గురించి దమయంతి నాకు అన్నీ చెప్పింది. అదీకాక ఈ చుట్టుపక్కల గ్రామ ప్రజలందరూ కూడా పాండురంగం గురించి చాలా గొప్పగా చెప్పేరు... పాండురంగం స్నేహితుడు నాగేంద్ర తల్లిని కూడా కలిసేను. పాండురంగంను ఎలాగైనా కాపాడాలనే ఇక్కడికి వచ్చేను'' అని చెప్పేను.

''మంచిది బాబూ... నీలాటి వాళ్ళు కొంతమందైనా వుండబట్టి ఇంకా న్యాయం అనే పదానికి కొంచం విలువుంది అనిపిస్తోంది. నిన్ను చూస్తే నాకు చాలా సంతోషంగా వుంది... మా అబ్బాయిని కాపాడుకోటానికి ఇంతవరకు నాకు ఎవరూ తటస్తించలేదు...

నా పూర్తి సహాయం నీకుంటుంది... మా అబ్బాయిని ఎలాగైనా కాపాడుబాబూ'' కంట తడితో చెప్పింది పాండురంగం తల్లి.

''అందుకే ఇక్కడికి వచ్చేను.., న్యాయం గెలుస్తుందని నిరూపించటానికే వచ్చేను. .. కానీ పాండురంగం ఎక్కడున్నాడో తెలియటంలేదు... అదే ఇప్పుడొచ్చిన ప్రాబ్లం'' పాండురంగం ఎక్కడున్నాడో మీకు తెలుసా అని డైరెక్ట్‌గా అడగలేక, పాండురంగం ను కాపాడాలనే నిర్ణయం నాలో వున్నట్టు చెప్పాను.

''నాకు చాలా సంతోషంగా వుంది బాబు...మావాడు ఎక్కడున్నాడో నాకు తెలుసు... నేనే స్వయంగా నిన్ను వాడిదగ్గరకు తీసుకెళ్తాను... ముందు కాళ్ళు కడుక్కో... భోజనం చేద్దువుగాని'' పాండురంగం వున్న చోటు తనకు తెలుసునని పాండురంగం తల్లి చెప్పడంతో, ఇక ఆలస్యం చెయ్యకూడదని, నాలోని ఆశ్చర్యం కనబడకుండా ''ఎక్కడున్నాడో చెప్పండి. నేను వెళ్ళి కలుస్తా'' కుర్చీలోంచి లేస్తూ చెప్పేను.

''ఆ చోటుకి ఇప్పుడు వెళ్ళలేం బాబూ. ప్రొద్దునే వెళదాం... ముందు కాళ్ళు కడుక్కో'' నాకు మాట్లాడే అవకాశం ఇవ్వక, కూతురు తెచ్చిన నీళ్ళ చెంబు నాకందిస్తూ చెప్పింది పాండురంగం తల్లి.

ఎక్కువ బలవంతం చేస్తే, నేను పోలీస్ వాడ్ని అని ఆమెకు తెలిసిపోతుందని భయపడి మరేమీ అడగక నీళ్ళ చెంబు తీసుకుని దొడ్లో అరటిచెట్టు క్రింద కాళ్ళు కడుక్కుని వచ్చేను.

పాండురంగం చెల్లి ఇచ్చిన టవల్‌తో ముఖం తుడుచుకుంటున్న నేను పాండురంగం ఇంట్లో భోజనం చెయ్యకూడదని నిర్ణయించుకున్నా... ''ఆ ఇంటి ఉప్పుతిని ఆ ఇంటికి ద్రోహం చెయ్యటమా'' అనే సెంటిమెంటుతో ''నేనిప్పుడు భోజనం చేయలేను... ఇందాకే బస్సుస్టేషన్ దగ్గర ఏదో కాకా హోటల్ కనబడితే అక్కడున్న చెత్త తిన్నాను... కడుపు సరిగ్గా లేదు'' తప్పించుకుందామని చెప్పేను. కానీ, పాండురంగం తల్లి, చెల్లెలు చేసిన బలవంతంవల్ల భోజనం చేయక తప్పలేదు.

భోజనం చేసి వచ్చిన నాకు మధ్య హాలులో పక్క ఏర్పాటు చేసింది పాండురంగం చెల్లెలు.

## అడ్రస్



ఇద్దరు తాగుబోతులు మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

''నేను మా ఇంటికి తాళం వేయ్‌కుండానే వొచ్చేస్తాను'' అన్నాడు ఒకడు.

''సర్లే. నేను బంగారు నగలన్నీ డ్రాయింగ్ రూమ్‌లో ఉంచేసి తలుపులుకూడా వెయ్‌కుండా వొచ్చేసాను'' గొప్పగా చెప్పాడు రెండోవాడు.

''ఇంతకీ మీ ఇంటి అడ్రస్‌లు చెప్పేదేమయినా ఉందా లేదా?'' విసుక్కున్నాడు వారి వెనకే వస్తున్న దొంగ.

—పి. శ్రీనివాస్ (వరంగల్)

పడుకున్నానేగాని మనసులో ఎన్నో ఆలోచనలు. పాండురంగం తల్లి నిజం చెప్తోందా. ఆవిడకి తన కొడుకు ఎక్కడున్నాడో తెలుసా

తల్లికి తెలిసినప్పుడు ... మిగతావారికి తెలియకుండా వుంటుందా... ఏమిటో మిగతావారందరికి తెలిస్తే బయట ప్రపంచానికి తెలిసిపోతుంది. కానీ తల్లి చెప్పదుకదా... నవమాసాలు మోసి కని, పెంచిన కొడుకు గురించి ఏ తల్లి చెప్పగలదు... అందుకే ఆ తల్లికి తెలిపుంటాడు తనెక్కడున్నది. అటువంటి తల్లిని, కొడుక్కి ద్రోహం చేయటానికి నేను కారకుడుగా వుండటం, నాకు చాలా బాధనిపించింది. కానీ నేనేం చెయ్యను... నేను నా డ్యూటీకి న్యాయం చెయ్యాలి. పాండురంగంను అరెస్టుచేసి కోర్టులో హాజరు పరచాలి... నేను పాండురంగంను అరెస్టు చేసిన వెంటనే ఆ తల్లి ఏమౌతుంది... కుప్పలా కూలిపోవచ్చు, కొడుక్కు ద్రోహం చేసాననే మనోవేదనతో మంచం పట్టవచ్చు, "అమ్మా... నువ్వా నన్ను పోలీసులకు పట్టించింది" అనే ఆ కొడుకు చూపుకు ఆ తల్లి మాడిపోవచ్చు... మైగాడ్ అలా తలచుకుంటేనే గుండె భారంగావుంది... ఇప్పుడు నిన్ను అరెస్టు చేసేది నిన్ను కాపాడటానికేనని నమ్మించాలి. నమ్ముతాడా... నమ్మించాలి. .. ఎలాగైనా నమ్మించి, పాండురంగంను కాపాడాలి" ఏదో అలికిడైతే నా ఆలోచనలు ఆపి అలికిడైనవైపు చూసేను. ఏంలేదు... నా భ్రమ.. పాండురంగం తల్లి, చెల్లి హాయిగా నిద్దరపోతున్నారు. బహుశ నేను పాండురంగంను కాపాడుతాననే, నిశ్చింతగా నిద్దురపోతున్నారు వాళ్ళిద్దరూ అనిపించింది నాకు. మళ్ళీ ఇంకో అనుమానం వచ్చింది నాలో, పాండురంగం తల్లి, చెల్లి నిద్దరపోతున్నట్టు నటిస్తున్నారేమో... ఒకవేళ నేను నిద్దరపోతే ఇద్దర్లో ఎవరో ఒకరు వెళ్ళి పాండురంగంకు నాగురించి చెబితే ఇంతా కష్టపడి కథ అడ్డం తిరిగితే... నో... అలా జరగకూడదు అనుకుంటూ ఆ రాత్రంతా నిద్దరపోకుండా, తల్లి, కూతుర్లను చూస్తూ గడిపేను.

తెల్లవారు జామున తల్లిలేచి, కూతురిని లేపింది. నేను నిద్దరపోతున్నట్టు నటించేను. "టైమైంది. లేచి పూజకు ఏర్పాట్లు చెయ్యి' తల్లి కూతురికి చెప్పింది. కొంచెం సేపట్లో దేవుడిమీద పద్యాలు మొదలైనాయి. నేను కూడా దేవుడికి దన్నంపెట్టుకుందామని లేచి స్నానం కానిచ్చి మనసులోనే దేవుడికి దన్నంపెట్టుకుని డ్రస్సువేసుకుని రెడీగా కూర్చున్నాను.

తల్లి, కూతురూ గూడా రెడీయై వచ్చి "రండి... మా అబ్బాయిదగ్గరికి తీసుకెళతా" అని చెప్పింది పాండురంగం తల్లి.

తల్లి, కూతుర్లతో బయలుదేరిన నేను, వాళ్ళతోపాటు నడుచుకుంటూ ఊరి చివరికి వచ్చేను. నాలో మళ్ళీ అనుమానం వచ్చింది. 'ఈ తల్లి, కూతుర్లు నిజంగానే నన్ను పాండురంగం దగ్గరకు తీసుకెళ్తున్నరా' అన్న అనుమానం నాలో ఎక్కువైంది. ఎందుకంటే ఇంకెక్కడా మనుషులు దాగుండే చోటు కనబడలేదు. ఒక్క స్మశానం తప్ప... దాగుండటానికి అదిగూడా మంచి చోటే అనుకుంటున్న నన్ను నిజంగానే ఆ స్మశానంలోకి తీసుకెళ్ళారు - తల్లి,

కూతుర్లు:

కొంచెం దూరం నడిచింతరువాత ఒక చోట ఆగి "అన్నయ్య ఉన్న చోటు పోలీసాయనకి చూపించు" పాండురంగం తల్లి కూతురుతో చెప్పింది.

పాండురంగం తల్లి నన్ను పోలీసాయన అనేటప్పటికి నేను అదిరిపడ్డాను ఆశ్చర్యంతో. ఆశ్చర్యంనుంచి తేరుకునేలోపల "ఏమిటి మీరు పోలీసు ఆఫీసర్ అని ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నారా... తెలిసింది బాబూ... రోజుకు రెండుసార్లన్నా నన్ను ప్రశ్నించందే ఊరుకోరు మా ఊరి పోలీసులు. ఇలా కొన్ని సంవత్సరాలనుంచి ప్రశ్నిస్తున్నారు. పోలీసోళ్లు మాయమాటలు చెప్పి నా దగ్గరనుంచి మా పాండురంగం ఎక్కడున్నాడా అని తెలుసుకోటానికి ప్రయత్నిస్తారు... వాళ్లడిగే ప్రశ్నలను, వాళ్లు మాట్లాడే మాటలనుబట్టి వాళ్లు పోలీసోళ్లని తెలిసిపోతుంది నాకు. నువ్వు కూడా అలాగే మాట్లాడేవు... ఏమైనా ఆ జాతికి చెందినవాడివి కదా... నువ్వు నిన్ను దమయంతి పంపిందని చెప్పావు. దమయంతి పంపితే తిన్నగా మా ఇంటికి రాకుండా నాగేంద్ర ఇంటికి వెళ్ళేవు. అప్పుడే తెలిసింది నువ్వు మా అబ్బాయిని అరెస్టు చెయ్యటానికి వచ్చిన పోలీసు ఆఫీసర్ అని... చాలాసార్లు మా అబ్బాయి పోలీసు వాళ్ళను తప్పించుకోవాలని ఎక్కడెక్కడో దాక్కునేవాడు... ఆ దాక్కునే చోట్లు నాకు తెలిసేది కాదు. నాకసలు చెప్పేవాడు కాదు... కానీ ఇప్పుడు మాత్రం మా అబ్బాయి వున్నచోటు నాకు తెలుసు. కానీ వాడు చెప్పికాదు.. వెళ్ళు బాబు, మా అమ్మాయి చూపిస్తుంది పాండురంగం వున్న చోటు... వెళ్లి అరెస్టు చేసుకో" కన్నీటితో చెప్పింది.

కాసేపు మౌనంగా నిలబడి పాండురంగం చెల్లెలుతో కొంచెం దూరం నడిచేను. పాండురంగం చెల్లెలు ఒక చోట ఆగి "ఇక్కడే మా అన్నయ్య వున్నాడు" అని పూలమాలలువేసివున్న ఒక సమాధిని చూపించింది ఏడుస్తూ.

మళ్ళీ ఆశ్చర్యపోయిన నాతో, నావెనకే వచ్చిన పాండురంగం తల్లి "అవును బాబూ... నా కొడుకు పాండురంగం ఆ సమాధిలో

## సూపర్ సూక్ష్మదర్శిని



సూక్ష్మమైన వాటిని పెద్దవిగా చేసి చూపించే పరికరాలను సూక్ష్మదర్శినులంటారు. నేడు అత్యంతశక్తివంతమైన సూక్ష్మదర్శినులు అందుబాటులోకి వచ్చాయి. స్కానింగ్ టనెలింగ్ మైక్రోస్కోపు ఒక వస్తువును పదిలక్షల రెట్లు పెద్దది చేస్తుంది. దానిలో అణువు స్థాయిని దాటి పరమాణుస్థాయి దాకా పరిశీలించవచ్చు. అంత సునిశితమైనది ఈ సూక్ష్మదర్శిని. శాస్త్ర పరిశోధనల్లో కొత్త మలుపులు తీసుకుని రాగలదు.

—పమ్మెంట గోవర్ధన్

వే వున్నాడు. మీరు వెదుకుతున్న పాండురం గం ఇందులోనే వున్నాడు తీసుకెళ్లండి బాబూ... మా పాండురంగంను అరెస్టుచేసి తీసుకెళ్లండి బాబూ'' అని ఏడుస్తూ ఆ సమాధిముందు కూర్చుండిపోయిన పాండు రంగం తల్లిని ''అమ్మా'' అని పిలిచేను.

''వద్దు బాబూ... ఆ పవిత్రమైన మాటని మీరు చెప్పి అపవిత్రం చేయకండి.. నవమాసాలు మోసి, కని, పెంచిన ఒక తల్లి హృదయం పడుతున్న బాధను అర్థంచే సుకోలేని మీ పోలీసోళ్లు ''అమ్మా'' అని పిలవటానికి అర్హులు కారు. ఎన్నోసార్లు మీ పోలీసోళ్ల కాళ్ళు పట్టుకుని వేడుకున్నాను. మా పాండురంగం తప్పుచెయ్యలేదు అని... అప్పుడు అర్థం చేసుకోలేని మీరు ఇప్పుడు ''అమ్మా'' అని సంబోధిస్తున్నారు. ఎందుకు బాబూ ఈ తల్లిని ఇంకా బాధపెడతారు. వెళ్లు, వెళ్లి నా పాండురంగంను అరెస్టు చేసి తీసుకెళ్ళు'' ఏడుస్తూ ఆ తల్లి చెప్పిన మాటలువిని తట్టుకోలేకపోయిన నన్ను చూ సి ''ఏం బాబూ... అరెస్టు చెయ్యలేవా... చచ్చిపోయిన వాడిని అరెస్టు చెయ్యటానికి మీ చట్టానికి, న్యాయానికి శక్తిలేదా... మీ పోలీసోళ్ల తెలివి అమోఘం కదా... మరి అరెస్టు చేయవేం... మీ పోలీసు రూల్స్‌లో చచ్చినవాడిని అరెస్టు చెయ్యకూడదని రూలు వుందా... ఏం మాట్లాడవేం... నువ్వెందు కు మాట్లాడతావు... మీకు తెలిసిందల్లా డబ్బు, రాజకీయ పలుకుబడి వున్న పెద్ద మనుషులవల్ల మానసికంగా చచ్చిపోయి, శారీరకంగా బతికున్నోళ్లనైతే అరెస్టు చెయ్య గలరు. అంటే చచ్చిన పామును ఇంకా చంపటమే మీ న్యాయానికి, చట్టానికి తెలుసు. మీ సంకెళ్ళకు శక్తివున్నది అలా చచ్చిన పామును చంపటానికే... పోలీసోళ్లు కాకీ బట్టలు వేసుకుంది మలినాన్ని తీసెయ్య టానికమనుకున్నాను. కాదు. మలినంతో చేతు లు కలిపి, ఆ మలినం తమ బట్టలకంటుకు న్నా తెలియకుండా వుండటానికేనని తెలుసు కునేప్పటికి చాలా ఆలస్యం అయ్యింది. అలాగే న్యాయమూర్తులకు, న్యాయవాదుల కు, న్యాయాన్ని చీకటిలోనే వుంచమనే వల్లగౌనులు తొడిగారు. పెద్దోళ్లకి అడుగులొ త్తుతూ అవసరమైతే క్రిందోళ్లని చంపమనే మీ పోలీసుస్టేషన్‌లకు, కోర్టులకు ఎర్రరంగు పూసేరు... మావాడు ఏం తప్పుచేసేడని వాడ్ని అరెస్టు చెయ్యటానికి వచ్చేరు... వాడు విషాన్ని విషం అని చెప్పినందుకా, దేవుడికి వెలిగించే దీపంలో సారా పొయ్యకూ డదు నూనే పొయ్యాలని చెప్పినందుకా... అన్నీ తెలిసిన మీకంటే ఒక గుడ్డి వాడు నయం... రాత్రి పగలు రెండు ఒకటిగా వున్నా రాత్రేదో, పగలేదో తెలుసుకోగలడు.. అవునా... చెప్పు బాబూ చెప్పు'' అని ఏడుస్తూ ఆ సమాధి ముందు కూర్చుండి పోయింది.

ఏడుస్తున్న ఆవిడను ఓదార్చాలని భుజం మీద చెయ్యేసాను ''వద్దు'' ఈ తల్లి శోకం ఎవరూ తీర్చలేరు'' అని నీరసంతో సమాధి ప్రక్కనే పడిపోయింది పాండురంగం తల్లి. గబగబ నేను, పాండురంగం చెల్లెలు కలిపి పాండురంగం తల్లిని ఇంటికి చేర్చేము. నీరసంతో కళ్ళు మూసుకుని అలాగే పడుకు న్న పాండురంగం తల్లిని పలకరించే ధైర్యంలే

క, పాండురంగం తల్లికి జరిగిన అన్యాయం చూసి ఓర్చుకోలేక "ఎలా జరిగింది" అని పాండురంగం చెల్లెలుని అడిగేను.

"రామాపురం అనబడే ఈ గ్రామంలో రామరాజ్యం చచ్చిపోయి రావణరాజ్యం ఏర్పడింది. అప్పటి రావణాసురుడి బాధ్యతను మా ఊరి చైర్‌మన్ రంగారావు చేపట్టాడు. రామాయణంలో రావణాసురుడు ఒక్క రాముడి భార్యమీదే ఆశపడ్డాడు. కానీ రంగారావు ఈ గ్రామంలోని ప్రతి ఆడదాని మీద ఆశపడ్డాడు. రాముడనే వాడు లేకపోయే సరికి ఎంతోమంది అబలల జీవితాలు గాళ్ళికెగరేసాడు రంగారావు. అక్రమ సంపాదనతో ఎంతో డబ్బు గడించి రాజకీయ నాయకులకు, పోలీసు ఆఫీసర్లకు దగ్గరయ్యేడు రంగారావు.

రంగారావు అక్రమాలు ఎక్కువవుతుంటే మా అన్నయ్యలోని రాముడు లేచేడు. రావణాసురుడి లాంటి రంగారావును ఎదుర్కొనటం ప్రారంభించేడు.. అదే అదే నచ్చలేదు రంగారావుకి... మా అన్నయ్యమీద తప్పుడు కేసులు బనాయించి, తన దారికి అడ్డురాకుండా తప్పిద్దాం అనుకున్నాడు... కొన్ని రోజులలోనే ప్రజాబలం సంపాదించుకున్న మా అన్నయ్యను పోలీసువాళ్ళు ఏమీ చేయలేకపోయారు... కొంచెం, కొంచెం ప్రజాబలం ఎక్కువవుతుంటే మా అన్నయ్యకు, దమయంతికి చెడు సంబంధం అంటగట్టాడు. దమయంతికి అన్యాయం చేశాడు... ప్రజాబలంతో రంగారావుని ఎదుర్కొని, దమయంతిని రంగారావు బారినుండి రక్షించేడు మా అన్నయ్య... అన్నిట్లోను ఆటంకం అయిపోయాడు. రంగారావు చేష్టలకు కొంచెం అడ్డుపడింది... సంతోషపడుతున్న మా గ్రామ ప్రజలు సడన్‌గా శోకంలో మునిగిపోయారు... ఆరోజు మా అన్నయ్య పుట్టినరోజు... తలంటుకుందామనుకున్న మా అన్నయ్య దగ్గరకు హరిజనవాడ మనుషులందరూ ఏడుస్తూ వచ్చారు... మా అన్నయ్యకు వాళ్ళు పక్కబలంగా వుంటున్నా



రని వాళ్ళ గుడిసెలు తగలబెట్టి, ఎంతోమంది ఆడవారిని మానభంగం చేసేరుట... అది విని తట్టుకోలేని మా అన్నయ్య తన ఫ్రెండ్నుని వెంటబెట్టుకొని, మా అమ్మ ఎంత వారిస్తున్నా వినకుండా రంగారావుతో గొడవకి బయలుదేరాడు.

సాయంత్రం వరకు ఇంటికి రాలేదు... "రంగారావు ఇంటిమీద దాడి జరిగిందని మా అన్నయ్య ఫ్రెండ్నును అరెస్టు చేసేరుట. మా అన్నయ్య మాత్రం పారిపోయేడుట" " ఆ రాత్రి మా ఇంటికొచ్చిన పోలీసోళ్లు చెప్పారు. అది విన్న మా అమ్మకు ఏడుపొచ్చింది. పోలీసోళ్లు వెతుకుతున్నారని కాదు... రంగారావు ఇంటిమీద దాడి జరిపినందుకూ కాదు... పుట్టిన రోజు పండుగనాడైనా కొడుక్కి తన చేతులారా భోజనం పెడదామని ఆశపడ్డది... మా అన్నయ్య ఎప్పుడైతే రంగారావుని ఎదుర్కోనటం మొదలెట్టాడో ఆరోజునుంచి ఏ అర్ధరాత్రి అయినా ఇంటికొస్తాడుగాని, భోజనం మాత్రం ఎక్కడో, ఎవరింట్లోనో తిని వచ్చేవాడు.

కొడుకు అర్ధరాత్రికైనా తిరిగొస్తాడు, వాడికి తన చేతులారా భోజనం పెడదామని ఎదురు చూస్తున్న మా అమ్మకు మా అన్నయ్య కాకుండా ఎవరో నలుగురు మనుషులు ఇంటి తలుపులు తీసుకొని లోనికివచ్చేరు. ఏమిటి హడావిడి అనుకుంటూ నేను అక్కడికి వచ్చేను. వచ్చిన నలుగురు మనుషుల వెనకాల చైర్మన్ రంగారావు, భుజాలమీద ఎవర్నో పడుకోబెట్టుకుని వచ్చేడు.

రంగారావు భుజంమీదున్న మనిషి మా అన్నయ్య అని తెలిసిపోయింది మాకు... చుట్టుపక్కల జనం కోసం అరవబోయిన మావోళ్ళు మూసేసేరు రంగారావు మనుషులు.

భుజంమీదున్న మా అన్నయ్యను మా అమ్మకాళ్ళ దగ్గర పడేసాడు రంగారావు... ఎర్రని నెత్తురుతో వున్న మా అన్నయ్యకు ఏం జరిగిందో తెలిసిపోయింది. క్రిందపడివున్న మా అన్నయ్యను ముట్టుకోబోయిన అమ్మతో "చూడు... నీ కొడుకు రంగన్నకి చాలాసార్లు చెప్పేను... నా పనులకు అడ్డం రావద్దని... వినలేదు... పెద్ద గాంధీ మహాత్ముడిలా నేను చేసే ప్రతి పనికి అడ్డువచ్చేడు. అందుకని ఆ గాంధీ మహాత్ముడికి ఏం జరిగిందో అదే జరిగింది... నువ్వు నీ కొడుకుని ఎంత ప్రేమిస్తున్నావో నాకు తెలుసు... అందుకే చివరి చూపుకు తీసుకొచ్చేను. నోరు తెరచి గొడవపెట్టేవా... చూసుకోడానికి నీ కూతురు కూడా వుండదు. మాతో రా" అని మా అమ్మను, నన్ను, మా అన్నయ్య శవాన్ని శ్మశానంలోకి తీసుకెళ్ళి మా కళ్లెదురుగుండానే మా అన్నయ్యను పూడ్చేశారు" అంతదాకా దుఃఖాన్ని అణుచుకున్న పాండురంగం చెల్లెలు పెద్దగా ఏడుపు మొదలెట్టింది.

నాలో రక్తం కుతకుతలాడుతుంటే, మెల్లిగా నడిచి పాండురంగం తల్లి పాదాలకు నమస్కరించి, జేబులో పాండురంగం పేరుతోవున్న వారెంట్ తీసి, పాండురంగం పేరుకొట్టేసి రంగారావుపేరు రాసి వడివడిగా అడుగులేసుకుంటూ బయటకు నడిచేను ■